PDF Compressor Free Version

Licensed to post without Prepayment No. J/Nellore/003/12-14 R.N.I.No.25359/74 - PLG/NL/9-10/03 నెల్లూరు, 17.05.2013, శుక్రవారం సంపుటి : 32 సంచిక : 50 పేజీలు : 12, వెల : ₹ 4




# లాయర్

వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంగ్రాహకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి www.lawyerteluguweekly.com



# అందరి కన్ను 'హోం'పైనే!

జగన్‌ను లక్ష్యంగా చేసుకుని కాంగ్రెస్ అధిష్టానం వేసిన కేసుల ఎత్తుకు రాష్ట్ర కేబినెట్‌లోని మంత్రివర్యులు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. కొండనాలుకకు మందువేస్తే ఉన్న నాలుక ఊడిపోయినట్లయ్యింది రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ పరిస్థితి. జగన్ ఒక్కడిని దెబ్బతీసేందుకు రాష్ట్రంలో కాంగ్రెస్‌పార్టీనే బలిదానం చేసారు. జగన్ పాటికి జగన్ జైలులో వున్నాడు. జైలు జీవితానికి అలవాటు పడిపోయాడు. జైలు నుండి బయటకు వచ్చినా మళ్ళీ జైలుకే పోయి వుండాలనేంతగా జైలు జీవితం ఆయనకు అలవాటైపోయింది.

కాని రాష్ట్ర మంత్రివర్యుల పరిస్థితే అగమ్యగోచరంగా మారుతుంది. జగన్‌పై కక్షకట్టి కేసులు కట్టారు. జగన్‌పై కేసులను నిరూపించాలంటే మంత్రులను ఒక్కొక్కరిని జాతరలో పొట్టేళ్ల మాదిరిగా బలిచేస్తూ రావాలి. జగన్‌పై అభియోగాలు మోపిన ఏ కేసులోనూ ఆయనకు ప్రత్యక్ష సంబంధా లున్నట్లు నిరూపించలేరు. కాని పలువురు (మిగతా 5వ పేజీలో)

# 'బలి' చక్రవర్తి



## పొగబెట్టి సాగనంపే ప్రయత్నం చేస్తున్న అధిష్టానం

మా కుటుంబసభ్యులే ప్రధానిగా వుండుంటే అయోధ్యలో బాబ్రీ మసీదు కూలేదా?... కొన్నేళ్ల క్రితం ఉత్తరప్రదేశ్‌లో కాంగ్రెస్ యువరాజు రాహుల్‌గాంధీ అన్న వ్యాఖ్యలివి. దేశంలో నెలకొన్న కుటుంబ పాలనకు, కాంగ్రెస్‌లో ప్రబలిన వారసత్వ రాజకీయాలకు రాహుల్ వ్యాఖ్యలే అద్దంపడుతున్నాయి.

ఇందిరాగాంధీ కుటుంబసభ్యులు కాకుండా కాంగ్రెస్ నుండి ఇంకెవరు ప్రధాని అయినా చివరకు అపనిందలతో దిగిపోవాల్సిందే! ప్రధాని సీటులో ఇంకే నాయకుడు కుదురుగా పనిచేస్తున్నా చూసి తట్టుకునే శక్తి ఇందిర కుటుంబసభ్యులకు లేదు. మేము తప్పితే ఈ దేశాన్ని ఇంకెవరూ ఏలలేరనే అహంకారం వారిలో బలంగా వుంది. కాంగ్రెస్‌పార్టీ నుండి ఇందిర కుటుంబసభ్యులు కాని వారు నలుగురు ప్రధానులుగా చేసారు. వారిలో లాల్‌బహదూర్‌శాస్త్రి, గుల్జారీలాల్‌నందలు చాలా స్వల్పకాలమే ప్రధానులుగా వుండినారు. కాబట్టి బ్రతికిపోయారు. లేకుంటే వీరిని కూడా అసమర్థులుగా జమకట్టి పక్కన పడేసి వుండేవాళ్లు. వీరి తర్వాత పి.వి.నరసింహారావు 5ఏళ్లు ప్రధానిగా పనిచేసారు. రాజీవ్‌గాంధీ హత్యతో కాంగ్రెస్‌కు దశదిశా నిర్దేశం కరువైనప్పుడు క్లిష్ట పరిస్థితుల్లో (మిగతా 5వ పేజీలో)

# పల్లెసీమ వాకిట్లో.. జి.వి.కె. చదువుల చెట్టు

## జివికె చిన్మయ విద్యాలయ



పల్లెసీమలే ఈ దేశానికి పట్టుకొమ్మలు... రైతన్నే ఈ దేశానికి వెన్నెముక... అని పంచాయితీ వార్డు మెంబర్ నుండి ప్రధానమంత్రి వరకు అందరూ ఘనంగా చెప్పేవాళ్లే! కాని ఆ పల్లెసీమల ఉద్ధరణకు పాటుపడుతున్నదెవరు? నీళ్లు లేక, కరెంట్ లేక, పైర్లు పండక, కడుపులు నిండక, సరైన చదువు లేక, వైద్యం అందక... ఇక ఇలాంటి పరిస్థితుల్లో పల్లెల్లో వుండలేక, వుండీ బ్రతకలేక ప్రతిరోజూ ఎంతోమంది పల్లెల నుండి పట్టణాలకు వలసబాట పడుతున్నారు. నగరంలో, పట్టణాలలో ఈరోజు ఎంతోమంది తల్లిదండ్రులు తమ బిడ్డల చదువు కోసమే (మిగతా 5వ పేజీలో)







■ 33 అడుగుల తారు (బి.టి) రోడ్లు ■ అన్ని రోడ్లకు కరెంటు సౌకర్యం కలదు, మరియు స్ట్రీట్ లైట్స్ ■ లేఅవుట్ పరిధిలో పచ్చని మొక్కలు ■ 100% వాస్తు ■ లేఅవుట్ చుట్టూ బార్డర్ వైరింగ్ ■ మంచి అందమైన పార్కులు ■ లేఅవుట్ ఎంట్రన్స్ ఆర్చ్
■ నెల్లూరు నగరానికి అతి చేరువలో కార్పొరేషన్ పరిధిలో... ■ లే అవుట్ దగ్గరగా ఇంజనీరింగ్ కాలేజ్, ఇంటర్ నేషనల్ స్కూల్, టాప్ క్లాస్ కళ్యాణ మండపం, దేవాలయాలు

16-3-676, Beside SBH Bank, Ramurthy Nagar, Nellore, A.P. (M) 94402 06888 , 99489 06888

PDF Compressor Free Version



• సీన్ మారింది

# దుగరాజపట్నమే ఖరారైంది



• రాష్ట్రంలో రెండో పెద్ద ఓడరేవు
• జిల్లాలో రెండో ఓడరేవు
• పారిశ్రామికంగా ఇది మరో ముందడుగు
• సిఎం, చిరంజీవిని అధిగమించి నెల్లూరుకు తెచ్చిన చింతా

నెల్లూరుజిల్లా ప్రత్యేక గుర్తింపును పొందనుంది. దుగరాజపట్నంలో దాదాపు 8కోట్లుతో ఓడరేవు ఏర్పాటుకు ఇటీవల కేంద్ర కేబినేట్ ఆమోదముద్ర వేయడంతో జిల్లాలో మరో కీలక అభివృద్ధికి తెర తీసింది. ఎన్నో ఏళ్ళుగా సాగిన సర్వేలు, రూపొందించిన ప్రతిపాదనలు త్వరలో కార్యరూపం దాల్చనున్నాయి. దిగుమతులకు కేంద్రమైన దుగరాజపట్నం మరో మారు ఆస్థాయిలో గుర్తింపు పొందేందుకు సిద్ధమైంది. ఈ ప్రాంతంలో సముద్రం లోతు ఉండడం పోర్టు ఏర్పాటుకు అనుకూలంగా ఉండడంతో పలుసర్వేల్లో అన్నీ అనుకూలంగా ఉన్నప్పటికీ షార్, పక్షుల కేంద్రం సమీపంలో ఉన్నందున ఇక్కడ పోర్టు ఏర్పాటు వీలు కాదని ఒక వాదన ప్రచారంలోకి వచ్చినప్పటికీ, కేంద్ర ప్రభుత్వ ఆమోదంతో పరిసర ప్రజలు ఆనందాన్ని వ్యక్తంచేసారు. పోర్టు నిర్మాణ పనులు ఆరంభంకాగానే వాకాడు, కోట, చిల్లకూరు, చిట్టమూరు, మండలాల నైసర్గిక స్వరూపం మారిపోనున్నది. భూముల విలువలు పెరగడంతో పాటు జీవన ప్రమాణాల్లో మార్పు రానుంది. ఓడరేవు ఆధారంగా పలు పరిశ్రమలు ఏర్పాటుకానున్నాయి. పేదలకు మెరుగైన ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. గూడూరు నుంచి దుగరాజపట్నం వరకు కోట, వాకాడు మీదుగా రైల్వేలైను ఏర్పాటు అవుతుందని, రోడ్ల విస్తరణ కొత్తగా రోడ్ల నిర్మాణం జరగనున్నాయి. ఓడరేవు విస్తరణ జరిగే క్రమంలో కొండూరుపాళెం, అంజలాపురం పరిసర గ్రామాలకు స్థానచలనం ఏర్పడే అవకాశముంది. ఫలితంగా మత్స్యకారుల, గిరిజనులకు ప్రత్యేక పునరావాసం ఏర్పాటు తప్పనిసరి. జీవనోపాధి కోల్పోతున్నందుకు ప్రత్యేక ప్యాకేజీ పంపిణీ అనివార్యంగా మారనుంది. ఎంతోకాలంగా ప్రభుత్వ భూముల్లో వ్యవసాయం చేసుకుంటున్న సన్నకారు రైతులకు పరిహారం లభించే అవకాశముంది. వ్యవసాయం, అనుబంధ రంగాలపై ఆధారపడి జీవనం సాగించే వ్యవసాయ కూలీలకు ప్యాకేజీ లభించనుంది. ఓడరేవు, అనుబంధ ప్రాజెక్టుల్లో స్థానికులకే ఉద్యోగాలు కల్పించడం ప్రధాన ప్రక్రియ.

జిల్లాలో రెండో ఓడరేవుగా రూపుదిద్దుకొనే దుగరాజపట్నం పోర్టుపై ఈ ప్రాంతంలోని అన్ని వర్గాల ప్రజలు ఆశల పల్లకిలో ఉన్నారు.

## ఆడపడుచులకు అన్నగా అండగా నిలుస్తా

**- కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి**



అన్నదానం నిర్వహిస్తున్న కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి

అంతర్జాతీయ మాతృదినోత్సవం సందర్భంగా ఈ నెల 12న నెల్లూరులోని ప్రగతి ఛారిటీస్ ఆవరణలో వైయస్సార్ సీపీ నేత నిజాముద్దీన్ ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని వైయస్సార్సీపీ నెల్లూరురూరల్ సమన్వయకర్త కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ప్రారంభించగా డాక్టర్ బిందుమీనన్ ప్రగతి ఛారిటీస్ అనాథాశ్రమ, మానసిక వికలాంగ బాలలకు వైద్యపరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. తదుపరి వృద్ధులు, పిల్లలకు నిజాముద్దీన్ తదితరులు అన్నదానం చేసారు. కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ స్త్రీని ఆదిశక్తిగా భావించి పూజించే భారతదేశంలో నేడు అదే స్త్రీపై అత్యాచారాలు జరగడం ఎక్కువైపోయిందని బాధపడ్డారు. అయితే వైయస్సార్సీపీ నాయకులు నిజాముద్దీన్ మాతృదినోత్సవం గొప్పతనాన్ని చాటుతూ సేవా కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమన్నారు. వైయస్సార్ కాంగ్రెస్ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ, ఉద్యమాలు సాగిస్తూ ప్రజలకు నిత్యం సేవలు అందిస్తోందని, రూరల్ నియోజకవర్గంలో ఇప్పటివరకు ఐదుచోట్ల ఉచిత వైద్యశిబిరాలు నిర్వహించిందని తెలిపారు. భవిష్యత్‌లో మరిన్ని సేవా కార్యక్రమాలు, వైద్యశిబిరాలు నిర్వహిస్తామని తెలిపారు. మహిళలకు తోబుట్టువులా, బిడ్డలా అండదండగా నిలుస్తానని పేర్కొన్నారు.

కార్యక్రమంలో వైయస్సార్సీపీ నాయకులు షాన్‌వాజ్, ఖలీద్, ఉమర్, అబూబకర్, సమీర్‌బాషా, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## అవస్థల్లో అన్నదాతలు

**- బీజేపీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి**



నెల్లూరులోని బీజేపీ కార్యాలయంలో ఈ నెల 13న జరిగిన విలేకరుల సమావేశంలో బీజేపీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కర్నాటి ఆంజనేయరెడ్డి, జిల్లా అధ్యక్షుడు సురేంద్రరెడ్డిలు పాల్గొని రాష్ట్రంలో రైతుల దుస్థితిపై ఆందోళన వ్యక్తం చేసారు. సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి మాట్లాడుతూ రైతులు ప్రకృతి వైపరీత్యాలకు నష్టపోయి అప్పుల ఊబిలో కూరుకుపోతుంటే రాష్ట్ర ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందని పేర్కొన్నారు. అకాల వర్షాలకు వరి, బొప్పాయి, మిర్చి, బత్తాయి, మామిడిరైతులు నష్టపోయారని, వారికి నష్టపరిహారం చెల్లింపులు చెయ్యకుండా ప్రభుత్వం రైతుచైతన్యయాత్రలు నిర్వహించేదానికి కోట్ల రూపాయలు ఖర్చు పెట్టడం విచారకర మన్నారు. జల్ తుఫాన్ వల్ల నష్టపోయిన రైతులకు ఇంతవరకు నష్టపరిహారం చెల్లించ లేదని, మద్దతుధర కల్పించడంలో కూడా ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. కర్నాటక, తమిళనాడు రాష్ట్రాల్లో వరికి బోనస్ చెల్లిస్తుంటే రాష్ట్రప్రభుత్వం 12శాతం ట్యాక్స్ వసూలుచేస్తుందని ఎద్దేవా చేసారు. జిల్లా కలెక్టర్ అయినా రైతులను ఆదుకోవాలని, వడగండ్ల వానకు, ఈదురుగాలులకు నష్టపోయిన రైతులకు ప్రభుత్వం వెంటనే నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేసారు.

## పోలీసులు పనిచేస్తున్నారు!

ఈమధ్య కాలంలో జిల్లా పోలీసుల పనితీరు మీద పెద్ద ఎత్తున విమర్శలు వస్తుండడం చూస్తున్నాం. కాని నగరంలో పోలీసులు ఇప్పుడిప్పుడే గాడిలో పడి పనిచేస్తున్నారు. నగర డిఎస్పీ వెంకటనాథ్‌రెడ్డి కొంచెం శ్రద్ధపెట్టి పనిచేస్తూ, చేయిస్తున్నాడు. నగరంలో బార్లు, వైన్ షాపులను రాత్రి 11గంటలకు ఖచ్చితంగా మూయించేస్తున్నారు. మద్రాసు బస్టాండ్, వైఎంసిఏ గ్రౌండ్ ప్రాంతంలో ట్రాఫిక్‌కు ఇబ్బంది కలిగిస్తున్న రోడ్డు మార్జిన్ వ్యాపారులను తొలగించడంతో ఈ రోడ్డు మీద ట్రాఫిక్ సాఫీగా సాగిపోతుంది. స్పెషల్ డ్రైవ్‌లతో అడ్డదిడ్డంగా తిరుగుతున్న ఆటోలు, సిటీబస్సులను అదుపు చేస్తున్నారు. పోలీసులు రోజూ ఇదే విధంగా పనిచేస్తుంటే నగరం బాగుంటుంది. ఎప్పుడో ఒకసారి పని చేస్తే యథారాజ తథా ప్రజలే!

## 'ప్రతాప్'ం చూపిస్తున్నాడు



నాయకులు ఒక్కసారిగా ఆకాశం నుండి ఊడిపడరు. భూమిని చీల్చుకుని రారు. నాయకులు ప్రజల మధ్యనే వుంటారు. ప్రజల కోసమే పనిచేస్తూ ప్రజానాయకులుగా తమనుతాము తీర్చిదిద్దుకుంటారు. మన సమాజంలో చాలామంది నాయకులు పంచాయితీ వార్డు మెంబర్ స్థాయి నుండి తమ రాజకీయ ప్రస్థానాన్ని మొదలుపెట్టి ముఖ్యమంత్రులు, కేంద్రమంత్రుల స్థాయికి కూడా ఎదిగారు. సమాజంలో కొత్త నాయకులు ఉద్భవించాలంటే అలాంటి వారికి అవకాశం కల్పించాలి. తమ సత్తాను చాటుకునే వేదికలు అందించాలి. అలాంటి వేదికనే కావలి నియోజకవర్గ సమన్వయకర్త రామిరెడ్డి ప్రతాప్‌రెడ్డికి అందించింది వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ!

రామిరెడ్డి ప్రతాప్‌రెడ్డి... రాజకీయ అనుభవం చాలా తక్కువ. రాజకీయ ప్రయాణం మొదలుపెట్టి కేవలం నాలుగేళ్లే అయ్యింది. అయితేనేం... ప్రజల్లోకి దూసుకుపోతున్నాడు. ఆత్మస్థైర్యంతో ముందుకు పోతున్నాడు.

రామిరెడ్డి ప్రతాప్ బెంగుళూరులో రియల్‌ఎస్టేట్ వ్యాపారి. బాగా సంపాదించాడు కాబట్టి కడుపులో చల్ల కదలకుండా వుండొచ్చు. ఎర్రటి ఎండలో పదిమందితో కలిసివుండే ఆనందం ఏ.సి రూములో ఒంటరిగా రాదు కదా! ప్రజలకు తనవంతు సేవ చేయాలనే సంకల్పంతో రాజకీయాల వైపు దృష్టి సారించాడు. "ప్రేమే మార్గం – సేవే లక్ష్యం" అంటూ వచ్చిన చిరంజీవి మాటలను నమ్మి ఆయన మాయలో పడ్డాడు. 2009ఎన్నికలలో కావలి నుండి ప్రజారాజ్యం అభ్యర్థిగా పోటీచేసి మూడో స్థానంలోకి పోయి చేతి చిలుం చాలానే వదిలించుకున్నాడు. ఆ తర్వాత జగన్ సారధ్యంలోని వైకాపాలో చేరాడు. నెల్లూరుజిల్లా స్థానిక శాసనమండలి నియోజకవర్గం ఎన్నికలలో వైకాపా అభ్యర్థిగా పోటీచేసి తనకంటే రాజకీయంగా ఎంతో సీనియర్ అయిన వాకాటి నారాయణరెడ్డికే చుక్కలు చూపించినంత పని చేసాడు. కేవలం 9ఓట్ల తేడాతోనే ఆయన ఓడిపోయాడు. కావలికి ప్రతాపే బెస్ట్ అని భావించిన జగన్ ఆయననే కావలి ఇన్‌ఛార్జ్‌గా నియమించాడు. ప్రతాప్‌ను కావలి ఇన్‌ఛార్జ్‌గా పెట్టడం మేకపాటి సోదరులకు ఇష్టం లేదు. మలిరెడ్డి రవీంద్రనాథ్‌రెడ్డిని ముందుపెట్టి ప్రతాప్‌ను అడ్డుకోవాలనుకున్నారు. కాని మేకపాటి ప్రయత్నాలు ఫలించలేదు. ప్రతాప్ మీద జగన్‌కు ఎంత గురి వుందనేది ఆయనను కన్వీనర్‌గా పెట్టడంతోనే అర్ధమైపోయింది.

జగన్ తనపై పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేయకూడదనే సంకల్పంతో ప్రతాప్ కాళ్లకు బలపాలు కట్టుకుని కావలి నియోజకవర్గమంతా తిరుగుతున్నాడు. కేవలం జగన్ ఇమేజ్‌తోనే కాదు, ప్రజలతో తమకు ప్రత్యక్ష సంబంధాలు అవసరమనే ఉద్దేశ్యంతో 'దీవెనయాత్ర'తో ప్రతాప్ ఇళ్లిళ్లు తిరుగుతున్నాడు. రాజకీయాలకు కొత్త అయినా పాత నాయకుల కంటే వేగంగా ఆయన చొచ్చుకెళుతుండడం విశేషం.

## అంతా రామమయం

**విఐపి స్వామి సేవలో తరించిన ప్రముఖులు**



ర్యాలీ నిర్వహిస్తున్న భక్తులు

ఆ స్వామి ఏమాయ చేస్తున్నాడో, ఏ మహిమ చూపుతున్నాడో, ఏ మంత్రం వేస్తున్నాడోగాని, విఐపి భక్తులు మాత్రం పోటెత్తినట్లు వస్తున్నారు. ఈ స్వామికి విఐపి భక్తుల సంఖ్య నానాటికీ పెరుగుతుండడం పలు అనుమానాలకు దారి తీస్తుంది. ఈ విఐపి భక్తులు రావడం చూస్తుంటే స్టాలిన్ సినిమా, చైన్‌లింక్ స్కీంలు గుర్తుకు రాకమానవు. ఒకరు నలుగురుని తీసుకురావడం... ఆ నలుగురూ తలా నలుగురిని తీసుకురావడం... ఈ స్వామి ఆశ్రమంలో విఐపి భక్తులకు ఈ తరహా స్కీం ఏదో అమలులో వున్నట్లుంది. లేకపోతే దేశం నలుమూలల నుండి కూడా రాజకీయ, పారిశ్రామిక, సినీదిగ్గజాలు ఈ ఆశ్రమానికి క్రమం తప్పకుండా వస్తున్నారు.

కావలి సమీపంలో ప్రకాశం జిల్లా పరిధిలోగల చేవూరులో శ్రీరామదూత ఆశ్రమం విఐపి ఆశ్రమంగా పేరుబడింది. ముఖ్యమంత్రులు, కేంద్రమంత్రులు, రాష్ట్ర మంత్రులు, వివిధ పార్టీల అగ్రనేతలు, డిజిపిలు, కలెక్టర్‌లు, ఐజిలు వంటి ఉన్నతాధికారులు ఈ ఆశ్రమానికి తరచూ వస్తుంటారు. సోమవారం ఈ ఆశ్రమంలో సువర్ణదత్త లక్ష్మీ దాంపత్య వ్రతదీక్ష విరమణ కార్యక్రమం జరిగింది. బీజేపీ అగ్రనేతలు మురళీమనోహర్‌జోషి, నితిన్ గడ్కరి, మాజీగవర్నర్ వి.రామారావు, మంత్రి పితాని సత్యనారాయణ, ఎమ్మెల్సీ డి.శ్రీనివాస్, హోంశాఖ కార్యదర్శి టి.పి.దాస్, ట్రాన్స్‌కో సిఎండి విద్యాసాగర్‌రెడ్డి తదితర విఐపిలు పాల్గొని రామదూత ఆశీస్సులు పొందారు.

ఈ విఐపి భక్తులు చెన్నై లేదా రేణిగుంట ఎయిర్‌పోర్టులలో దిగి కారుల్లో ఆశ్రమానికి చేరుకోవాల్సి వస్తుంది. దామవరం వద్ద ఎయిర్‌పోర్టు కడితే ఈ రామదూత భక్తులకన్నా అది ఉపయోగపడుతుంది. స్వామికి ఇంకా విఐపి భక్తులు పెరిగే అవకాశం వుంది.

PDF Compressor Free Version



• బి.సి.లకే డీసీసీ?

# పదవుల పంపకం జరిగేనా?



**ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో జిల్లాకు పూర్తిస్థాయి డీసీసీ అధ్యక్షుడిని నియమించే దిశగా పీసీసీ కసరత్తు చేస్తున్నట్లు తెలుస్తుంది.**

జిల్లా కాంగ్రెస్‌కు ఇంకా పూర్తి అధ్యక్షుడిని నియమించలేదు. డీసీసీ అధ్యక్షుడుగా వున్న ఎల్లసిరి గోపాలరెడ్డి పార్టీ వదిలి వైయస్సార్ కాంగ్రెస్‌లో చేరాక కొత్త డీసీసీ అధ్యక్షుడిని నియమించలేదు. జిల్లా కాంగ్రెస్ మొత్తం ఆనం సోదరుల చేతుల్లోనే వుంది కాబట్టి తమ అనుచరుడిగా వున్న చాట్ల నరసింహారావునే ఇన్‌ఛార్జ్ డీసీసీ అధ్యక్షుడిగా కొనసాగిస్తూవచ్చారు. ఆయన నగర కాంగ్రెస్ అధ్యక్ష బాధ్యతలు కూడా చూస్తున్నాడు. ఇన్‌ఛార్జ్ అధ్యక్షుడిగా చాట్ల నరసింహారావునైతే పెట్టారుగాని ఆయనకు పూర్తిస్థాయి కార్యవర్గాన్ని ఇవ్వకపోవడంతో ఇన్‌చార్జ్ అధ్యక్షుడిగా ఆయన పాత్ర స్టేజీషోలకు పరిమితమవుతూ వస్తుంది. కనీసం పార్టీ సభ్యత్వ నమోదు బాధ్యతలను ఎవరికి అప్పగించాలో కూడా తెలియని పరిస్థితి. ఇందిరాభవన్‌లో అప్పుడప్పుడూ జిల్లా కాంగ్రెస్ కార్యకర్తల సమావేశాలు జరుగుతున్నాయి తప్పితే జిల్లా కాంగ్రెస్ కార్యవర్గ సమావేశాలు లేవు.

ఒకపక్క తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షుడిగా బలహీనవర్గాలకు చెందిన బీద రవిచంద్రను నియమించి వున్నారు. వైయస్సార్ కాంగ్రెస్ జిల్లా కన్వీనర్‌గా వెనుకబడిన వర్గాలకు చెందిన మేరిగ మురళీధర్‌ను పెట్టారు. రాబోయేది ఎన్నికల సీజన్. కులాల ఓట్ల బ్యాంకులను దృష్టిలో పెట్టుకుని పదవులను ఇవ్వాల్సి వుంటుంది. ముఖ్యంగా కాంగ్రెస్‌లో కులం పరంగా పదవులు ఇచ్చే సాంప్రదాయం ఎక్కువ. ఏ కులం వారికి ఏ పదవి ఇస్తే ఎన్ని ఓట్లు వస్తాయనే లెక్క వారి వద్ద ఖచ్చితంగా వుంటుంది. రాబోయేది ఎన్నికల సీజన్ కాబట్టి ఈసారి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడిగా బలహీనవర్గాలకు చెందిన నాయకుడినే నియమించే అవకాశాలు కనపడుతున్నాయి. డీసీసీ అధ్యక్షులుగా ఎక్కువగా ఒక అగ్రవర్ణం వాళ్లే వుంటూ వచ్చారు. మధ్యమధ్యలో పట్రా ప్రకాశరావు వంటి వాళ్లను పెట్టి నడిపించారు. ప్రస్తుతం జిల్లా కాంగ్రెస్ పెత్తనాన్ని ఆనం సోదరులు చూస్తున్నారు కాబట్టి డీసీసీ అధ్యక్షులుగా అగ్రవర్ణాల వారిని నియమించబోరు. డీసీసీ అధ్యక్షుడిగా ఎవరున్నా పెత్తనం ఆనం సోదరులదే కదా! కాబట్టి ప్రస్తుతం ఇన్‌ఛార్జ్‌గా వ్యవహరిస్తున్న చాట్ల నరసింహారావునే పూర్తిస్థాయి డీసీసీ అధ్యక్షుడిగా నియమించవచ్చు. లేదంటే రాచాల రవికుమార్‌యాదవ్, పి.చెంచలబాబుయాదవ్ లలో ఒకరిని డీసీసీ అధ్యక్షుడిగా నియమించే అవకాశాలున్నాయి.

ఎన్నికల కాలం మొదలు కావడంతో త్వరలో నామినేటెడ్ పదవుల భర్తీ చేస్తామని స్వయంగా ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్‌రెడ్డి ప్రకటించివున్నారు. నెల్లూరుజిల్లాలో చాలా మంది కాంగ్రెస్ నాయకులు నామినేటెడ్ పదవుల కోసం వరదల్లో ఆహారపొట్లాల కోసం ఎదురుచూస్తున్న బాధితుల మాదిరిగా ఎదురుచూస్తున్నారు. మరి ఎన్నికల లోపు ఈ పదవుల పంపకం మాత్రం అనుమానమే!

## వివేకా.. వెకిలి చేష్టలు మానుకో..



ప్రజాదీవెనలో వైకాపా నాయకులు అనిల్, పులిమి శైలజ తదితరులు

నెల్లూరు రూరల్ శాసనసభ్యులు ఆనం వివేకానందరెడ్డి ఇప్పటికైనా వెకిలిచేష్టలు మానుకోవాలని వైఎస్సార్‌సీపీ నెల్లూరు నగర నియోజకవర్గ సమన్వయకర్త పోలుబోయిన అనిల్‌కుమార్‌యాదవ్ హితవు పలికారు. బుధవారం నెల్లూరు నగరంలోని 15వడివిజన్ ఆదిత్యనగర్‌లో ప్రజాదీవెన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ ఢిల్లీ పెద్దలు సిబీఐని పావులా వాడుకుంటూ జగన్‌ను అకారణంగా జైల్లో పెట్టించారని మండిపడ్డాడు. వైయస్సార్ వల్ల ఆనం సోదరులు రాజకీయంగా ఆర్థికంగా బలపడ్డారన్నారు. జిల్లాలో దొంగలు, విశ్వాసఘాతుకాలు అవినీతి పరులు ఎవరని ప్రజలను ప్రశ్నిస్తే ఎ.సి.సెంటర్‌వైపు చూపుతున్నారన్నారు. 15ఏళ్ళుగా ఎమ్మెల్యేగా ఉన్న వివేకాకు నగరంలో ఎన్ని వీధులు ఉన్నాయో కూడా తెలియదన్నారు. నల్లచొక్కా వేసుకుని మహిళల తాళిబొట్లు దోచుకునేవాడిలాగా వున్నానని వివేకా మాట్లాడడం శోచనీయమన్నారు. జగన్‌మోహన్‌రెడ్డిని అక్రమంగా జైలోపెట్టినందుకు నిరసనగా నల్లదుస్తులు వేసుకుని తిరుగుతున్నానన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీనాయకులు పులిమి శైలజ, పులిమి రత్నాకర్‌రెడ్డి, వేనాటి శ్రీకాంత్‌రెడ్డి, భాస్కరరెడ్డి, శశిధర్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, మనోహర్‌రెడ్డి, శ్రీకాంత్, కృష్ణ, సురేష్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, శేషురెడ్డి, నాగేశ్వరరావు, నవకోటి మణి తదితరులు పాల్గొన్నారు.

పెంచలకోన బ్రహ్మోత్సవాలకు

## బ్రహ్మాండంగా ఏర్పాట్లు



సమావేశంలో ప్రసంగిస్తున్న మంత్రి ఆనం రామనారాయణరెడ్డి

నెల్లూరు జిల్లా రాపూరు మండలం పెంచలకోన దివ్యక్షేత్రంలో వేంచేసియున్న శ్రీ పెనుశిల లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానంలో ఈ నెల 20వ తేదీ నుంచి జరగనున్న బ్రహ్మోత్సవాలకు సంబంధించి అధికారులు సమన్వయంతో పనిచేయాలని రాష్ట్ర ఆర్థికశాఖామంత్రి ఆనం రామనారాయణరెడ్డి జిల్లా అధికారులకు సూచించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ నెల 20వ తేదీ నుంచి 26వ తేదీ వరకు బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అన్ని శాఖల అధికారులు సిబ్బంది సహకారంతో విజయవంతంగా నిర్వహించేలా చర్యలు చేపట్టాలన్నారు. వివిధ డిపోల నుంచి పెంచలకోనకు ప్రత్యేక బస్సులను నడపాలని సూచించారు. ప్రత్యేక విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయాలన్నారు. పారిశుద్ధ్య లోపం లేకుండా చూడాలన్నారు. అగ్నిమాపక యంత్రాలను సిద్ధం చేసుకోవాలని ఆదేశించారు. బ్రహ్మోత్సవాలు జరిగే రోజుల్లో పరిసర గ్రామాల్లో మద్యం అమ్మకాలు జరగకుండా ఎక్సైజ్ శాఖ దృష్టి సారించాలన్నారు. 22న హనుమంతసేవ, 23న గరుడసేవ, 24న కల్యాణం జరుగుతుందన్నారు. నెల్లూరురూరల్ మండలంలోని శ్రీ వేదగిరి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలోనూ ఇవే రోజుల్లో బ్రహ్మోత్సవాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు జాయింట్ కలెక్టర్ సి.హెచ్. పెంచలరెడ్డి, నెల్లూరు ఆర్డీఓ మాధవీలత, పలుశాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## మంత్రి డ్రైవింగ్ లైసెన్స్ రెన్యూవల్

రాష్ట్ర ఆర్థికశాఖామంత్రి ఆనం రామనారాయణరెడ్డి డ్రైవింగ్ లైసెన్స్ గడువు ముగియడంతో రెన్యూవల్ చేయించుకున్నారు. డిజిటల్ సంతకం, ఫోటో తీయించాల్సి ఉండటంతో సోమవారం సోమాజిగూడలోని ఆర్టీఏ కార్యాలయానికి మంత్రి వచ్చారు. అనంతరం లైసెన్స్‌ను జేటీసీ పాండురంగారావు మంత్రికి అందజేశారు.

అవగాహన సదస్సులో...

## అసహనాల కస్సుబుస్సు



కాంగ్రెస్, తెలుగుదేశం నాయకుల మధ్య వాగ్వివాదం

కావలి మండలం మద్దూరపాడు ఏఎంసీ గోదాము ఆవరణములో ఈనెల 15న జరిగిన రైతుసదస్సుకు రైతులు కరువయ్యారు. ఖాళీ కుర్చీలు దర్శనమిచ్చిన సదస్సును రాష్ట్రమంత్రి ఆనం రామనారాయణరెడ్డి జ్యోతిప్రకాశనం చేసి ప్రారంభించారు. రైతులకు వ్యవసాయంలో చేపట్టాల్సిన నూతన విధానాలపై అవగాహన ఏర్పరచేందుకు నిర్వహించిన ఈ సదస్సులో అధికార, ప్రతిపక్షనేతల వాగ్వివాదాలు వినిపించాయేకాని రైతులకు అవగాహన కల్పించడం కనిపించలేదు. టిడీపీనేత నాయుడు రాంప్రసాద్ మంత్రిని ఉద్దేశించి అన్ని ప్రాంతాలకు నీళ్ళు విడుదల చేయాలని డిమాండ్ చేసారు. కాంగ్రెస్ నాయకులు గ్రంథి యానాదిశెట్టి జోక్యం చేసుకొని రైతుసదస్సులో రైతు సమస్యలపై మాత్రమే మాట్లాడాలని, మిగిలిన విషయాలు అనవసరమని అనడంతో ఇద్దరి మధ్య వివాదం చెలరేగింది. గ్రంథికి సోమశిల ప్రాజెక్ట్ కమిటీ ఛైర్మన్ కండ్లగుంట మధుబాబు తోడయ్యాడు. మంత్రి ఆనం రామనారాయణరెడ్డి వారించినా వారి మధ్య వివాదం ఆగలేదు. ఇరువర్గాలకు చెందిన వారు గుమికూడడంతో పోలీసులు రంగప్రవేశం చేసి సర్దిబెట్టారు. ఇదిట్లా వుంటే కావలి ఎమ్మెల్యే బీదమస్తాన్‌రావు తెదేపా అయినా మంత్రి ఆనం రామనారాయణరెడ్డిని పొగడడం కొసమెరుపు. కావలి నియోజకవర్గ అభివృద్ధికి కాంగ్రెస్‌పార్టీ తెచ్చిన నిధులను తమ నిధులుగా మీ నాయకులు చెప్పుకుంటున్నారని అధికార పార్టీనేతలు ఎమ్మెల్యే బీదను అంతకుముందే విమర్శించి వున్నారు. తమకు ఎవరు ఏ పార్టీలో వున్నారో అర్థంకావడం లేదని వారు వాపోయారు.

## ఎన్నికలెప్పుడొచ్చినా కాంగ్రెస్ విజయదుందుభి



రాష్ట్రంలో ఎన్నికలు ఎప్పుడు వచ్చినా కాంగ్రెస్ పార్టీ విజయదుందుభి మోగిస్తుందని జిల్లా ఇన్‌చార్జి, సాంఘిక సంక్షేమ శాఖామంత్రి పితాని సత్యనారాయణ పేర్కొన్నారు. సోమవారం కావలి పట్టణానికి వచ్చిన మంత్రి విలేకరులతో మాట్లాడుతూ జగన్‌వల్ల వారి మీడియావల్ల ప్రజలు అలజడికి గురయ్యారని, తిరిగి వారికి అర్థమయ్యేలా వివరించి పార్టీ పూర్వవైభవానికి వచ్చిందన్నారు. కాంగ్రెస్ నుంచి పోయేవాళ్ళంతా పోయారని, ఇక వెళ్ళే వారెవరూలేరని కొత్తగా వచ్చే వాళ్ళే ఉంటారన్నారు. జరగనున్న పంచాయితీ, మండల, మునిసిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ సత్తా చూపిస్తామన్నారు. అవినీతికి పాల్పడిన కేంద్రమంత్రులను తొలగించిన కాంగ్రెస్ ప్రభుత్వం ంలో మరెందుకు మరోలా ప్రవర్తిస్తుందని విలేకర్లు అడుగగా అక్కడే మంత్రులు నేరు ితికి పాల్పడినట్లు పార్టీ గుర్తించిందన్నారు. రాష్ట్రంలో ఆరోపణలు ఎదుర్కొంటున్న మంత్రులు పావులు మాత్రమే అయ్యారన్నారు. పారిశ్రామికవేత్తలు జగన్ కంపెనీలో పెట్టిన పెట్టుబడుల మూలంగా వీరు బలయ్యారు. జగన్ మీడియా ప్రజలను మభ్యపెట్టి కథనాలను పదేపదే రాస్తూ చూపిస్తుందన్నారు. కాంగ్రెస్ నాయకులు గోపాలరెడ్డి, కామయ్య, శ్రీనివాసులు, ప్రసన్నాంజనేయులు, కామరాజు, రాజశేఖర్, నున్నా వెంకట్రావు, సుధీర్‌రెడ్డి పాల్గొన్నారు.

## తెలుగు భాషను రక్షించుకోవాలి





సభలో ప్రసంగిస్తున్న ఆచార్య ఆదిత్య

తెలుగు భాషను రక్షించుకోవాలని వక్తలు పిలుపునిచ్చారు. నెల్లూరు నగరంలోని ఆదిత్య డిగ్రీ కళాశాల సెమనార్ హాల్లో అధికార భాషాదినోత్సవాన్ని పురస్కరించుకుని తెలుగు భాషోద్యమ సమితి ఉపాధ్యక్షుడు బియస్‌ఆర్ ఆంజనేయులు ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా బివిజి దేవరాజులు పాల్గొని మాట్లాడుతూ గతంలో పోలిస్తే ప్రస్తుతం తెలుగుభాషకు ప్రాధాన్యం ఏర్పడిందని ఈ కారణంగా తెలుగు మహాసభలు విజయవాడ, చెన్నై, తిరుపతి తదితర ప్రాంతాల్లో జరిగాయన్నారు. ఈ కార్యక్రమంలో అకెళ్ళ రామనాథశాస్త్రి, ఆచార్య ఆదిత్య, సోంపల్లి ఆనందరావు, విజయరామచౌదరి, కె.అంకయ్య, నాగిరెడ్డి, కరీముల్లా, జయరామయ్యలు పాల్గొన్నారు.

PDF Compressor Free Version






## ఛీ!బీఐ నిర్వాకం

సీబీఐ పనితీరును గురించి లోకం కోడై కూస్తోంది. బొగ్గు కుంభకోణం పుణ్యమా అని సీబీఐ రాజకీయ వత్తిళ్ళతో పనిచేస్తోందని సర్వోన్నత న్యాయస్థానానికి అవగత మైంది. వై.యస్.ఆర్. కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షుడు జగన్‌మోహాన్‌రెడ్డికి కుంటి. గుడ్డి సాకులతో బెయిలు రాకుండా ఛీబీఐ అడ్డుపడుతోంది. కొన్ని షరత్తులతో కూడిన బెయిలు జగన్‌కు మంజూరు చేస్తే మిన్ను విరిగి మీద పడదు. కొంపలంటు కోవు. సీబీఐ నిర్వాకాన్ని త్రోసిరాజని తక్షణం జగన్‌కు షరతులతో కూడిన బెయిల్ ఇవ్వడం ప్రజాభిప్రాయాన్ని గౌరవించినట్లవుతుంది.

కురుగూరు రంగనాథం, నెల్లూరు.

## మన్మోహన్ దిగిపోవాలి

భారత ప్రధానిగా మన్మోహన్ సింగ్ సమర్థవంతంగా, ప్రభావితంగా పనిచేయలేకపోతున్నారు. నీతిమంతుడనే పేరు తప్పితే కేంద్ర స్థాయిలో అవినీతిని ఆపలేకపోతున్నాడు. అవినీతి మంత్రులను వెనకేసుకొస్తున్నాడు. అవినీతి కేబినెట్‌కు అధిపతి ఆయన. ఇలాంటి అవినీతికర ప్రభుత్వాన్ని నడిపేకంటే గౌరవంగా ప్రధాని పదవి నుండి తప్పుకోవడం ఉత్తమం. రాజకీయాలలోకి దిగాక, ఎంతటి నీతిమంతుడైనా అవినీతి బురదంటాల్సిందేననేందుకు మన్మోహన్‌సింగే ఉదాహరణ.

చిన్ని మురళీకృష్ణ, నెల్లూరు.

## అతను హంతకుడా?

జగన్‌కు బెయిల్ రాకుండా అడ్డుకుంటుండడం శోచనీయం. జగన్‌కు బెయిల్ రాకపోవడానికి వెనుక రాజకీయశక్తులు పనిచేస్తున్నట్లనిపిస్తుంది. లేకపోతే బెయిల్ కోసం ఇన్ని నెలలా? ఆయనేమన్నా హత్యలు చేసాడా? గ్యాంగ్‌రేప్‌లకు పాల్పడ్డాడా? క్రిమినల్స్‌కు కూడా నెలకల్లా బెయిల్ ఇస్తున్నారు. ఆయనేం దేశం వదిలిపోయే దావూద్ ఇబ్రహీం కాదు. బాధ్యతగల ప్రజాప్రతినిధి. పైగా ప్రజలు మెచ్చిన నాయకుడు. ప్రజాస్వామ్యంలో ప్రభుత్వాలకు ప్రజాభీష్టం పట్టడం లేదు. ఇప్పటికైనా బెయిల్ ఇవ్వొచ్చు కదా!

కె.వెంకటరెడ్డి, కలశపాడు.

# 'ప్రభా'తం

ఇరుగుపొరుగు మంచిదైతే ప్రతి రోజూ ప్రశాంతంగా ముగిసిపోతుంది. కాని ఎదురుగా, పక్కన వుండేవాళ్లు దగాకోర్లు, చీటికి మాటికి గొడవలకు దిగేవాళ్లయితే మనం ఎంత చెవులు, కళ్లు మూసుకుని ప్రశాంతంగా వుందామనుకున్నా వుండలేం. మన ఇంటి ఇరుగుపొరుగు ఎలా మంచివాళ్లు వుండాలనుకుంటామో, మన ఇరుగుపొరుగు దేశాలు కూడా అలాంటి దేశాలై వుండాలనుకుంటాం. మన ఇంటి పక్కన వున్నవాళ్లు మంచివాళ్లు కాకపోతే మనమే ఇల్లు మారొచ్చు. కాని మన దేశానికి పక్కన వున్న దేశాలు మంచివి కాకపోతే, మన దేశాన్ని మార్చుకోలేం కదా!

మన ఖర్మకాలి మన ఇరుగుపొరుగు దేశాలు అటువంటివే దాపురించాయి. మనల్ని కబళిద్దామని కాపుకాసి వున్న చైనా, స్వాతంత్ర్యంతో పాటే మత విభజన ప్రాతిపదికన మనం ఏర్పాటు చేసుకున్న పాకిస్థాన్, రామాయణ కాలం నుండి వైరం వున్న శ్రీలంక... మన ఇరుగుపొరుగు దేశాలు.

శ్రీలంకలో ఏళ్ల తరబడి తమిళులపై జరుగుతున్న వివక్ష చూస్తూనే వున్నాం. తమిళుల హక్కుల విషయంలోనే భారత్-శ్రీలంకల మధ్య భేదాభిప్రాయాలు వస్తున్నాయి. భారత్-శ్రీలంకల మధ్య సంబంధాలు అంతంత మాత్రంగానే వుంటున్నాయి. ఇక చైనాను చూస్తే మన సరిహద్దుల్లో గుంటనక్క మాదిరిగా పొంచివుంది. ఈమధ్యే లడఖ్ ప్రాంతంలోకి చైనా దళాలు చొచ్చుకు రావడం, భారత సైన్యం అక్కడ మోహరించడం, దీంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొనడం జరిగింది. ఇరు దేశాల మధ్య చర్చలతో సైనికదళాలు వెనక్కుపోయి సమస్యకు తాత్కాలిక తెరపడింది. భారత భూభాగంలోకి చైనా చొరబాట్లు కొత్తేమీ కాదు. గతం లోనూ జరిగాయి. ఒకసారి ఏకంగా చైనాతో యుద్ధమే చేసాము. అరుణాచల్‌ప్రదేశ్ మాదంటూ చైనా ఇప్పటికీ తన వితండవాదనను కొనసాగిస్తుంది. భారత్‌కు శత్రుదేశంగా వున్న పాకిస్థాన్‌ను చైనా ఎగదోస్తుంది. పాకిస్థాన్ సాగిస్తున్న భారత వ్యతిరేక కార్యకలాపాలకు చైనా అండదండలు పుష్కలంగా వున్నాయన్నసంగతి తెలిసిందే!

## ఇప్పటికైనా మారేనా?



ఎన్ని ప్రభుత్వాలు మారినా భారతదేశం పట్ల పాక్ వైఖరిలో ఎలాంటి మార్పు రాదు. ఎప్పటికీ రాదు. పాకిస్థాన్‌తో మనం ఎప్పటికప్పుడు స్నేహపూర్వక సంబంధాల కోసం ప్రయత్నిస్తున్నా ఆ దేశం ఆ ప్రయత్నాలకు గండి కొడుతూనే వుంది. నవాజ్‌షరీఫ్ వచ్చినా పరిస్థితిలో మార్పు ఉండకపోవచ్చు.

గాంధీ, నెహ్రూలు బ్రిటీషోళ్లతో పోరాడి మనకు స్వాతంత్ర్యం తెచ్చారు. స్వాతంత్ర్యంతో పాటు మత విభజనతో పాకిస్థాన్ అనే సమస్యను కూడా పక్కనే పెట్టారు. అరుదశాబ్దాలకు పైగా పాకిస్థాన్ మనల్ని ఎన్నిరకాలుగా ఇబ్బంది పెట్టాలో పెడుతూనే వుంది. జమ్మూ-కాశ్మీర్ చిచ్చును రగిల్చి దేశంలో ఉగ్రవాద కార్యకలాపాలకు ఊతమిస్తూనే వుంది. పాకిస్థాన్ మనకు శత్రుదేశం కాబట్టి, అది పక్కనే వుండబట్టి ప్రతి ఏటా కేంద్రప్రభుత్వం బడ్జెట్‌లో రక్షణ అవసరాలకు పెద్దపీట వేయాల్సి వస్తుంది.

పాకిస్థాన్‌తో సఖ్యత కుదుర్చుకుని ప్రశాంతంగా వుందామని భారత పాలకులు చేయని ప్రయత్నమంటూ లేదు. నెహ్రూ నుండి ఇందిరాగాంధీ, రాజీవ్‌గాంధీ, పి.వి.నరసింహారావు, వాజ్‌పేయి, నేటి మన్మోహన్‌సింగ్ వరకు పాకిస్థాన్‌ను మంచి దారిలో పెట్టేందుకు ఎవరి ప్రయత్నాలు వాళ్లు చేసారు. శిఖరాగ్ర సదస్సులు నిర్వహించారు. ఒకరి దేశాలకు ఒకర్ని ఆహ్వానించుకున్నారు. ఇరు దేశాల మధ్య రైళ్లు, బస్సులు నడిపారు. క్రికెట్ మ్యాచ్‌లను పునరుద్ధరించారు. ఇరు దేశాల అధినేతలు కూర్చుని క్రికెట్ పోటీలను తిలకించారు. ఇన్ని చేసినా కూడా పాకిస్థాన్‌లో మార్పు లేదు. చరిత్రలో ఆ దేశంతో మూడు యుద్ధాలు చేసాం, ఆ దేశపు అరాచకశక్తులు సాగించిన మారణ హోమానికి లక్షలాది మంది బలయ్యారు. మనల్ని ఇంతగా హింస పెడుతున్న ఆ దేశం ప్రశాంతంగా వుందా? అంటే అదీ లేదు. ఆ దేశంలో అనునిత్యం రాజకీయ సంక్షోభమే. సైనిక పాలన ఎప్పుడొస్తుందో తెలియదు, ప్రజాస్వామ్య పాలన ఎప్పుడుంటుందో అర్థంకాదు. వాళ్లు ప్రోత్సహించిన తీవ్రవాద గ్రూపులే అక్కడ కరాళనృత్యం చేస్తున్నాయి. పాలకులు అవినీతి ఆరోపణల మీద జైళ్లకు పోతున్నారు.

అయితే పాకిస్థాన్‌లో ఏ రాజకీయపార్టీకైనా భారత వ్యతిరేకతే పునాది. భారత్‌కు వ్యతిరేకంగా పోరాడి జమ్మూకాశ్మీర్‌కు విముక్తి కల్పిస్తాం అని నినదించినవాళ్లకే ప్రజల మద్దతు. ఆ దేశ పరిపాలనలో ఐఎస్ఐకి ఎనలేని ప్రాధాన్యత. పాకిస్థాన్‌లో రాజకీయ అనిశ్చితికి తెరదించుతూ జాతీయ అసెంబ్లీ ఫలితాలు వెలువడ్డాయి. 342 మంది సభ్యులుగల అసెంబ్లీలో 272స్థానాలకు ఎన్నికలు జరుగగా 127 స్థానాలలో నవాజ్‌షరీఫ్ నాయకత్వంలోని పాకిస్థాన్ ముస్లిం లీగ్ పెద్దపార్టీగా అవతరించింది. స్వతంత్రులతో కలిపి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయనుంది. 5ఏళ్ల నుండి అధికారంలో వున్న పాకిస్థాన్ పీపుల్స్ పార్టీకి ప్రతిపక్షహోదా కూడా దక్కలేదు. ఆ పార్టీ 35స్థానాలకే పరిమితం కాగా, మాజీ క్రికెటర్ ఇమ్రాన్‌ఖాన్ నేతృత్వం లోని తెహ్రికే ఇన్సాఫ్ పార్టీ 37సీట్లు సాధించింది.

నవాజ్‌షరీఫ్ పాక్ ప్రధాని అయితే భారత్‌తో సంబంధాలు ఎలా వుంటాయన్నది పెద్ద ప్రశ్న? గతంలో పాలకులకు ఈయనకు పెద్ద తేడా వుండదు. అదీగాక ఈయన పాత పాలకుడే! ఇప్పటికే రెండుసార్లు పాక్ ప్రధానిగా చేసారు. కార్గిల్ యుద్ధం తలెత్తింది ఈయన హయాంలోనే! కాకపోతే ఆరోజు సైన్యాధ్యక్షుడుగా వున్న పర్వేజ్ ముషారఫ్ పైకి దానిని నెట్టేసాడు. పోఖ్రాన్ అణుపరీక్షలకు పోటీ అణుపరీక్షలు జరిగింది కూడా షరీఫ్ నాయకత్వంలోనే. తాము తలచుకుంటే పదిహేను నిముషాలలో భారత్‌లోని నగరాలన్నింటిని నాశనం చేయగలమని పలికిన షరీఫ్ నాయకత్వంలో ఇరు దేశాల మధ్య శాంతి సంబంధాలు చిగురించేనా? నక్క గోవుగా మారుతానంటే వద్దనేదెవరు? చూద్దాం నవాజ్‌షరీఫ్‌లో అలాంటి మార్పు ఏదన్నా వస్తుందేమో!

# 'అంతర్'జాతీయం

- కొత్తతరం యుద్ధవిమానం మిగ్29కె పూర్తిస్థాయిలో భారత నావికా దళంలోకి ప్రవేశించింది. రక్షణ మంత్రి ఆంటోని ఈ విమానంలో అరగంటపాటూ ప్రయాణించి సురక్షితంగా దిగారు.
- మధ్యప్రదేశ్‌లో 24గంటల కరెంట్ దిశగా ఆ ప్రభుత్వం దూసుకుపోతుంది. అటల్‌జ్యోతి అభియాన్ క్రింద ఇప్పటికే 16జిల్లాలలో నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేస్తుంగా, తాజాగా 17వ జిల్లాగా రాజ్‌గఢ్ జిల్లాలో కూడా 24గంటల కరెంట్‌ను అమలులోకి తెచ్చారు.
- పరిశోధనలపై వ్యయాన్ని పెంచాలని రాష్ట్రపతి ప్రణబ్‌ముఖర్జీ అభిప్రాయపడ్డారు. 11వ తేదీ ఢిల్లీలో జరిగిన జాతీయ సాంకేతిక దినోత్సవంలో ఆయన మాట్లాడుతూ అమెరికా, చైనా వంటి అగ్రదేశాలు ఏటా చేస్తున్న పేటెంట్ దరఖాస్తులు మన కంటే 12రెట్లు ఎక్కువగా వున్నాయన్నారు. మన దేశంలో క్రిందిస్థాయిలో సరైన ప్రోత్సాహం లేదని ఆయన అన్నారు.
- అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం(ఐఎస్ఎస్)లో అమోనియా లీకేజీని అరికట్టేందుకు నాసా చేపట్టిన స్పేస్‌వాక్ ఫలించింది. స్పేస్‌వాక్ పూర్తయ్యాక అమోనియా లీకవుతున్న జాడలేవీలేవని, కనీసం నాలుగైదు వారాల పాటు పర్యవేక్షణ చేపట్టాల్సి వుందని నాసా డిప్యూటీ స్పేస్ స్టేషన్ ప్రోగ్రామ్ మేనేజర్ జోయెల్ మోంటాల్ బానో చెప్పారు.
- కర్నాటక ఎన్నికలలో భాజపా గెలిచి వుంటే ఆశ్చర్యపడేవాడినని ఆ పార్టీ అగ్రనేత ఎల్.కె.అద్వానీ తన బ్లాగ్‌లో పేర్కొన్నారు. కర్ణాటక సంక్షోభాన్ని పరిష్కరించడంలో పార్టీ సక్రమంగా వ్యవహరించ లేకపోయిందన్నారు. రాజకీయపార్టీల అనైతిక చర్యలను సహించేది లేదని కర్ణాటక ఓటర్లు స్పష్టం చేసారన్నారు.
- కాంగ్రెస్ అధ్యక్షురాలు సోనియాగాంధీ రాజస్థాన్‌లోని అజ్మీర్‌లోగల మొయినుద్దీన్ చిస్తీ దర్గాకు 13వ తేదీ ఛాదర్‌ను సమర్పించారు. దర్గా 801 ఉర్సుఉత్సవాల సందర్భంగా ఏఐసిసి ప్రధాన కార్యదర్శి ముకుల్ వాస్నిక్ ద్వారా ఈ చందర్‌ను పంపారు.
- పాకిస్థాన్ సాధారణ ఎన్నికలలో విజయం సాధించిన నవాజ్‌షరీఫ్‌ను భారత ప్రధాని మన్మోహన్‌సింగ్ భారత పర్యటనకు ఆహ్వానించడాన్ని బీజేపీ ఆక్షేపించింది. భారత్ విషయంలో ఆయన వైఖరి తెలుసుకున్నాకే ఆహ్వానించి వుండాల్సిందని పేర్కొంది.
- అవినీతి ఆరోపణల కారణంగా గత ఏడాది రైల్వేలో 6454మంది శాఖాపరమైన చర్యలు ఎదుర్కొన్నారని కేంద్ర విజిలెన్స్ కమీషన్ ఒక నివేదికలో వెల్లడించింది.

# వార్త వ్యాఖ్య

వార్త :- నేను కేసు నుండి బయటపడతాను. - పవన్‌కుమార్ బన్సల్ ధీమా.
వ్యాఖ్య :- ***ప్రభుత్వం మనదేగా... బయట పడతారులే!***

వార్త :- కేంద్రమంత్రి పదవి ఆశిస్తున్నా. - ఎంపీ కావూరి.
వ్యాఖ్య :- ***2014దాకా మీరు ఆశిస్తూనే వుంటారు.***

వార్త :- రాహుల్‌ను ప్రధాని కాకుండా అడ్డుకుంటా! - జనతా పార్టీ అధ్యక్షుడు సుబ్రహ్మణ్యస్వామి.
వ్యాఖ్య :- ***తోక అడ్డం పెట్టి ఎలుక ఏనుగును పడగొట్టాలనుకున్నట్లుగా వుంది.***

వార్త :- భారతీయ సంస్కృతిని రక్షించుకోవాలి. - జస్టిస్ ఎల్.నర్సింహారెడ్డి.
వ్యాఖ్య :- ***కాని ఇప్పుడు రివర్స్‌లో జరుగుతుంది.***

వార్త :- ఎన్నికల లోపే బి.సి ఉపప్రణాళిక. - మంత్రి నారయ్య.
వ్యాఖ్య :- ***ఆ కార్యక్రమం పెట్టేదే ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని కదా!***

వార్త :- అవినీతిపై మాట్లాడే హక్కు భాజపాకు లేదు. - కేంద్రమంత్రి చిరంజీవి.
వ్యాఖ్య :- ***దానికి పునాది వేసిన కాంగ్రెస్‌కు మాత్రమే వుందంటారా?***

వార్త :- అవినీతి అంతం కావాలని ప్రార్థించా. - తిరుమలలో చంద్రబాబు.
వ్యాఖ్య :- ***అవినీతి అంతమైతే రాజకీయాలలో ఎవరు మిగులుతారు?***

వార్త :- అవినీతి మంత్రుల్ని తొలగించండి. - గవర్నర్‌కు చంద్రబాబు వినతిపత్రం.
వ్యాఖ్య :- ***కేబినెట్ ఖాళీగా వుండాలనా మీ కోరిక!***

వార్త :- ప్రమాణస్వీకారానికి మన్మోహన్ వస్తే సంతోషం. - నవాజ్ షరీఫ్.
వ్యాఖ్య :- ***ఆయన వెనుకే ఉగ్రవాదులను పంపకుంటే మాకు సంతోషం.***

వార్త :- 'అమ్మహస్తం' మాకు అప్పగించండి. - సీఎంకు కిషన్‌రెడ్డి సవాల్.
వ్యాఖ్య :- ***మీ కమలాన్ని వాళ్లకిస్తారా?***

వార్త :- రైతుప్రభుత్వమని ధైర్యంగా చెప్పుకోగలం. - సీఎం కిరణ్.
వ్యాఖ్య :- ***పాపం రైతులే ధైర్యంగా వుండలేకపోతున్నారు.***

వార్త :- జైలుకు బాలీవుడ్ నటుడు సంజయ్‌దత్.
వ్యాఖ్య :- ***బ్యాలెన్స్ సినిమాలో జైలు సన్నివేశాలు పెట్టుకోవడం బెటర్!***

PDF Compressor Free Version



# అందరి కన్ను 'హోం'పైనే!

(మొదటిపేజీ తరువాయి)

మంత్రులకు మాత్రం ప్రత్యక్ష సంబంధాలున్నట్లు ఋజువు చేయగలరు. ఈ పరంపరలో మొదటి బలిపశువుగా బలహీనవర్గాలకు చెందిన మోపిదేవి వెంకటరమణను చెప్పుకోవచ్చు. జగన్‌పై కేసుల వ్యవహారంలో మోపిదేవి మంత్రి పదవిని కోల్పోయి జైలులో వున్నారు. జగన్ కేసులో సెకండ్ వికెట్‌గా ధర్మాన ప్రసాదరావు పడిపోయి వుండాలి. కాని ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్‌రెడ్డి మొండిధైర్యంతో ఆయనను కాపాడాడు.

కాగా ఇప్పుడు హోంమంత్రి సబితా ఇంద్రారెడ్డి వంతు వచ్చింది. వై.యస్. తొలి కేబినెట్‌లో భూగర్భగనుల శాఖ మంత్రిగా పనిచేసినప్పుడు విడుదల చేసిన జి.ఓలు ఇప్పుడు ఆమె మెడకే చుట్టుకున్నాయి. జగన్ అక్రమాస్తుల కేసులో సిబిఐ ఆమెను నాలుగో ముద్దాయిగా చేర్చడమేకాక పి.సి యాక్ట్‌ను కూడా నమోదు చేయడంతో హోంమంత్రి పదవికి ఇక ఆమె రాజీనామా చేయడం అనివార్యమైంది. అత్యంత వివాదాస్పదమైన కేసు విచారణను ఎదుర్కొంటూ ఆమె ఇక ఎక్కువ రోజులు హోంమంత్రిగా వుండలేరు. అలా వుండకూడదు కూడా! న్యాయస్థానాలు కూడా ఇందుకు ఒప్పుకోవు. కాబట్టి హోంమంత్రి పదవి నుండి ఆమె తప్పుకోక తప్పదు. సీఎం పదవి ఇక ఖాళీఅయ్యే సూచనలు కనిపించడం లేదు. సీఎం పదవి నుండి కిరణ్‌ను తప్పిస్తారనే ఆశలను అసమ్మతి వర్గం వదులుకుంది. ఆ అసమ్మతి మంత్రులకు ఇప్పుడు హోం శాఖపై మనసు పడింది. వాళ్లంతా హోం కోసం గట్టిగా ప్రయత్నిస్తున్నారు.

డిప్యూటీ సీఎం అయినప్పుడే దామోదర రాజనరసింహ హోంశాఖను కోరాడు. అయితే ఆరోజు కిరణ్‌కుమార్‌రెడ్డి అయనకు అది రాకుండా బలంగా అడ్డుపడ్డాడు. హోంను తనకు లేకుండా, కాకుండా చేసాడనే కోపంతోనే దామోదర రాజనరసింహ ఇప్పటికి కూడా కిరణ్‌పై కత్తి తిప్పుతున్నాడు. సబితమ్మ రాజీనామా చేస్తే తెలంగాణ ప్రాంతం వాడు కాబట్టి, అది కూడా డిప్యూటీ సీఎం కాబట్టి హోంశాఖ తనకు దక్కుతుందనేది రాజనరసింహ నమ్మకం.

బొత్స పీసీసీ అధ్యక్షుడిగా బొత్స సత్యనారాయణను మారుస్తారనే ప్రచారం వుంది. పీసీసీ పదవిని వదులుకోవాలంటే అందుకు సమానమైన పదవిని ఆయనకు కట్టబెట్టాలి. దానికి హోంశాఖే కరెక్ట్. పీసీసీ వదులుకోవాల్సి వస్తే హోంశాఖ కావాలని ఆయన పట్టుబట్టే అవకాశాలున్నాయి. ఇక సీఎంతో వైరం కొనసాగిస్తున్న రాష్ట్ర ఆర్థిక శాఖామంత్రి ఆనం రామనారాయణరెడ్డి కూడా హోంశాఖను కోరుతున్నట్లు తెలుస్తుంది. ఆర్థికశాఖను నిర్వహిస్తూనే హోం శాఖకు ఇన్‌ఛార్జ్‌గా వుండాలనే ఆలోచనలో, ఆశలో వున్నారు. రాబోయేది ఎన్నికల సీజన్. ఎన్నికల సమయంలో పోలీసు శాఖను బాగా వాడుకోవడం కాంగ్రెస్‌కు అలవాటు. ఆనం అయితే ఆ బాధ్యతను సమర్థవంతంగా నెరవేర్చగలడు. ఈ క్రమంలోనే హోంశాఖ రేసులో ఆయన పేరు కూడా బలంగా వినిపిస్తుంది. ముఖ్యమంత్రి కిరణ్ మాత్రం హోంశాఖ నుండి సబిత తప్పుకుంటే సమాచారశాఖ మంత్రిగా వున్న డి.కె.అరుణతో దానిని భర్తీ చేయాలని భావిస్తున్నట్లు సమాచారం. డి.కె. అరుణ సీఎం అనుకూల వర్గీయురాలిగా ముద్ర పడింది. సబితది తెలంగాణ... అరుణది తెలంగాణ... ఒక మహిళ స్థానంలో మరో మహిళను నియమించినట్లవుతుంది. సీఎం కూడా డి.కె.అరుణ వైపే మొగ్గు చూపుతున్నాడు. ఆమె అయితే తనకు ఎటువంటి సమస్యలు రావనేది ఆయన ఆలోచన. ఆమె కాకుండా బొత్స, రాజనరసింహ, ఆనంలలో ఎవరు హోం అయినా కిరణ్‌కు కంటిమీద కునుకు వుండదు.

# 'బలి'చక్రవర్తి

(మొదటిపేజీ తరువాయి)

పి.వి. పగ్గాలు చేపట్టాడు. సరికొత్త ఆర్థిక సంస్కరణలతో దేశాన్ని అభివృద్ధిపథంలో నడిపించాడు. అయితే ఆయన హయాంలో జరిగిన బాబ్రీ విధ్వంసం, కుంభకోణాలు ఆయన పరిపాలనకు మచ్చగా మిగిలాయి. సోనియాగాంధీ ఆయనను విలన్‌గా చూసింది. కాంగ్రెస్‌పార్టీ కోసం ఆయన చేసిన కృషిని మరచిపోయింది. ఆయన చనిపోయాక ఆయన పార్థివశరీరాన్ని కనీసం పార్టీ ఆఫీసులోకి కూడా రానీయలేదు. నెలల కాలం పాటూ పనిచేసిన మాజీ ప్రధానులు చనిపోతే కూడా దేశరాజధానిలో ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించి స్మారక చిహ్నాలు నిర్మించారు. కాని పి.వి.కి ఆ గౌరవం దక్కలేదు. ఆయన పార్థివదేహాన్ని హైదరాబాద్ పంపించారు. దేశాన్ని సంస్కరణల బాట నడిపిన ఓ రాజకీయ మేధావికి కాంగ్రెస్ అధిష్ఠానం ఇచ్చిన గౌరవం ఇది.

వీరి జాబితాలో ప్రస్తుత ప్రధాని మన్మోహన్‌సింగ్ కూడా చేరబోతున్నారా? ఇప్పుడు జరుగుతున్న పరిణామాలను చూస్తుంటే రేపు జరగబోయేది అదేనేమోనని పిస్తుంది. కుక్కను చంపాలంటే దానిమీద పిచ్చికుక్క అని ముద్రవేయాలి. మన్మోహన్‌సింగ్ విషయంలో ఇదే జరుగుతుంది. 2004లో ఆయన తొలిసారిగా ప్రధాని అయ్యారు. 5ఏళ్లు బాగా పనిచేసారు. కాబట్టే 2009లోనూ ప్రజలు తిరిగి అధికారం కట్టబెట్టారు. యూపిఏ-2లో సీన్ రివర్సయ్యింది. ఎన్నో కుంభకోణాలు వెలుగులోకి వచ్చాయి. మన్మోహన్ సర్కార్‌పై ఆరోపణలు వెల్లువెత్తాయి. బొగ్గు కుంభకోణంలో సిబిఐ నివేదికను చదివినందుకు కేంద్ర న్యాయశాఖ మంత్రి అశ్విన్ కుమార్ పదవిని వదులుకోవాల్సివచ్చింది. అలాగే లంచం కేసులో రైల్వేశాఖ మంత్రి పవన్‌కుమార్ బన్సాల్ రాజీనామా చేసారు. మన్మోహన్‌సింగ్ వీరిద్దరినీ కాపాడే ప్రయత్నం చేస్తుంటే సోనియానే వీరి చేత రాజీనామాలు చేయించారనే ప్రచారం వచ్చింది. అంటే ఇక్కడ సోనియా గొప్పదై, మన్మోహన్ చెడ్డవాడయ్యాడు. వాస్తవంగా చూస్తే మన్మోహన్‌సింగ్ రాజకీయ నాయకుడు కాదు. ఆర్థికమేధావి. కాంగ్రెస్ రాజకీయాలు అతనికి తెలియవు. పార్టీలో ఆయనకంటూ ప్రత్యేక వర్గం లేదు. వున్నోళ్లంతా సోనియా మనుషులే! మంత్రులంతా ఆమె పెట్టిన వాళ్లే! పార్టీలోనే కాదు, రాజకీయాలలోనూ అందరికంటే జూనియర్ మన్మోహన్‌సింగ్. సోనియా ఏది చెబితే అది చేసే కీలుబొమ్మ. కాబట్టి ప్రధాని ఏ తప్పు చేసినా, ఏ నిర్ణయం తీసుకోలేక పోయినా అది సోనియా తప్పే అవుతుంది. కాని ఇప్పుడలా జరగడం లేదు.

2014లో ప్రధాని అనుకుంటున్న రాహుల్‌కు ఇమేజ్ తీసుకురావాలంటే మన్మోహన్‌సింగ్‌ను వనికిమాలిన నాయకుడిగా చూపించాలి. అందుకే ఈ అవినీతి కుంభకోణాలన్నింటిని ఆయనకు అంటగట్టే ప్రయత్నం చేస్తున్నారు. ఈ ప్రధాని పదవి నాకొద్దు బాబు అని ఆయన పరుగులు తీసే పరిస్థితులు కల్పిస్తున్నారు. త్వరలోనే ఆరోజు రాబోతుంది.

# జివికె చదువుల చెట్టు

(మొదటిపేజీ తరువాయి)

**పల్లెలను వదిలివచ్చి వుంటున్నారు. మరి గ్రామాలలో మెరుగైన విద్యను అందిస్తే పుట్టిన గడ్డను వదిలి రావాల్సిన అవసరం వీరికి వుండదు కదా! అదిగో అలాంటి ఓ మహోన్నత ప్రయత్నానికే శ్రీకారం చుట్టాడు ప్రముఖ పారిశ్రామికవేత్త, నెల్లూరీయులు మావాడు అని గర్వంగా చెప్పుకోగల వ్యక్తి, జి.వి.కె. ఇండస్ట్రీస్ అధినేత జి.వి.కె.రెడ్డి.**

పారిశ్రామికంగా ఆయన ఎదిగిన ఎత్తును కొలవడానికి ఎటువంటి పరికరాలు వుండవు. కాని ఎంత ఎత్తుకు ఎదిగినా తన జన్మభూమి ఇందుకూరుపేట మండలం కొత్తూరులోకి వచ్చేసరికి ఆయన ఆ వూరి పిల్లాడిగానే మారిపోతాడు. ఆ వూరి మీద ప్రేమ అలాంటిది. ఆ ప్రేమాభిమానంతోనే ఆయన కేవలం మహానగరాలకే పరిమితమై వున్న ఆధునిక కార్పొరేట్ విద్యావ్యవస్థను తన జన్మభూమి కొత్తూరుకు తెచ్చాడు. రాష్ట్రంలోనే ఎక్కడా లేని విధంగా ప్రపంచంలోనే అత్యంత క్రమశిక్షణాయుత ఆధ్యాత్మిక సంస్థగా పేరుగాంచిన చిన్మయా మిషన్ వారిని కలుపుకుని కొత్తూరులో జి.వి.కె. చిన్మయా విద్యాలయను నిర్మించారు. సువిశాలమైన ఐదున్నర ఎకరాల స్థలంలో 36వేల చదరపు అడుగుల కట్టుబడి కలిగిన అధునాతన భవనాలతో ఈ పాఠశాలను ఏర్పాటు చేసారు. మొదట 1 నుండి 5వ తరగతి వరకు క్లాసులు ప్రారంభిస్తున్నారు. ప్రతి సంవత్సరం ఒక్కో తరగతి పెంచుకుంటూ పోతారు. సిబిఎస్‌ఇ సిలబస్‌తో కూడిన విద్యను బోధిస్తారు. అధునాతనంగా తరగతి గదులను, ల్యాబ్‌లను తీర్చిదిద్దారు. కేవలం విద్యకే విద్యార్థులను పరిమితం చేయకుండా నృత్యం, సంగీతం, చిత్రలేఖనం వంటి కళలలోనూ శిక్షణ ఇస్తారు. ఇక చిన్మయ మిషన్ అంటే ఆధ్యాత్మికతకు, నైతికతకు ప్రతీక. ఖచ్చితంగా విలువలతో కూడిన విద్యను బోధిస్తారు. ఇందుకూరుపేట మండల ప్రజలకు జివికె ఎన్నో వరాలను అందించాడు. ఇప్పుడు చదువుల పరంగా అందిస్తున్న ఈ కానుక ఎంతో విలువైనది. కొత్తూరు వాకిట్లో ఆయన కార్పొరేట్ చదువుల చెట్టును నాటాడు. ఈ చెట్టు నీడన ఎంతోమంది భవిష్యత్‌లు వికసించాలని ఆశిద్దాం.

ఎంతో ఉన్నత లక్ష్యంతో నిర్మించిన జి.వి.కె. చిన్మయ విద్యాలయను ఈ నెల 18వ తేదీ ఉదయం 8.30గంటలకు చిన్మయా మిషన్ సుప్రీం హెడ్ స్వామి తేజోమయానంద ప్రారంభించనున్నారు. జి.వి.కె. గ్రూప్ ఛైర్మెన్ పద్మభూషణ్ డాక్టర్ జి.వి.కె.రెడ్డి అధ్యక్షతన జరిగే ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి ఎం.రామలింగం కూడా పాల్గొననున్నారు. తమ గ్రామంలో ఇంత పెద్ద విద్యాసంస్థను నెలకొల్పిన జి.వి.కె. వదాన్యతకు ఇందుకూరుపేట మండల ప్రజలు చేతులెత్తి నమస్కరిస్తున్నారు.

# జైలర్లు డిప్యూటీ జైలర్లు బదిలీ

నెల్లూరుజిల్లా కేంద్ర కారాగారంలో పనిచేస్తున్న ఇద్దరు జైలర్లు, ఇద్దరు డిప్యూటీ జైలర్లను బదిలీచేస్తూ జైళ్ళశాఖ డిజీ కృష్ణంరాజు ఆదేశాలు జారీచేశారు. జైలర్ తిరుపాల్‌ను చిత్తూరుజిల్లా కారాగారానికి, గోవిందరెడ్డిని చర్లపల్లి సెంట్రల్‌జైలుకు బదిలీ చేసారు. వారి స్థానంలో మదనపల్లి స్పెషల్‌సబ్ జైలు జైలర్‌గా వున్న కాంతారావు, చెంచలగూడ సెంట్రల్ జైలు జైలర్ జయరామిరెడ్డిని బదిలీ చేసారు. జిల్లా కేంద్ర కారాగారంలోని డిప్యూటీ జైలర్లు రమేష్ హైదరాబాద్ సబ్‌జైలుకు, అరుణకుమార్ నిజామాబాద్ బోస్టన్ స్కూలుకు బదిలీ అయ్యారు. వీరిస్థానంలో నిజామాబాద్ జిల్లా జైలులోని డిప్యూటీ జైలర్ మధుసూదనరెడ్డి, వరంగల్ సెంట్రల్‌జైలులోని డిప్యూటీ జైలర్ పాండురంగారెడ్డిని నెల్లూరుకు బదిలీచేసారు.

# పోలీసు అధికారుల సంఘం సర్వసభ్య సమావేశం

నెల్లూరులోని ఆంధ్రప్రదేశ్ పోలీసు అధికారుల సంఘంజిల్లా కార్యాలయంలో ఈనెల 14న ఆ సంఘం తొలి సర్వసభ్య సమావేశం జరిగింది. జిల్లా ఎస్పీ బివి రమణకుమార్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సంఘంజిల్లా అధ్యక్షుడు మద్దిపాటి ప్రసాద్‌రావు కొన్ని సమస్యలను పరిష్కరించమని ఎస్పీని కోరగా ఆయన స్పందించి సత్వర చర్యలకు హామీఇచ్చారు. తదుపరి సంఘంజిల్లా గౌరవ అధ్యక్షుడిగా వై.శ్రీహరిబాబును, బి.శివప్రకాష్, సి.హెచ్.రూప్‌లను కోఆప్షన్ సభ్యులుగా ఎన్నుకున్నారు. సమావేశంలో ఏఆర్ ఏఎస్పీ ఐఎస్ఆర్ మూర్తి, నెల్లూరు నగర, గ్రామీణ ఏఆర్ డీఎస్పీలు పి.వెంకటనాథ్‌రెడ్డి, బాలవెంకటేశ్వరరావు, శివారెడ్డి, పోలీసు అధికారుల సంఘం జిల్లా కార్యదర్శి అంజిబాబు, ఉపాధ్యక్షులు సురేష్‌కుమార్‌రెడ్డి, జగన్మోహన్‌రావు, సహాయకార్యదర్శి వీరాంజనేయులు, కోశాధికారి బాబు తదితరులు పాల్గొన్నారు.


8వ వర్ధంతి

మరువలేని నీ తీపి జ్ఞాపకాలతో
నిత్యం నీ మధురస్మృతులతో

భర్త
కె.వి.రమణయ్య
సీనియర్ పాత్రికేయులు

కుటుంబ ఉన్నతికి అహర్నిశలు
శ్రమించిన మా యింటి దైవం
ఉన్నతమైన వ్యక్తిత్వంతో అందరి
మంచి కోరుకునే మా ఇంటిదీపం
మా అమ్మను స్మరిస్తూ...




శ్రీమతి కనుపర్తి రమాదేవి

కుమారులు - కోడళ్లు
కనుపర్తి రామకృష్ణప్రసాద్ - మీన
మృదుల
కనుపర్తి దయాశంకర్ - రేణుక
నితిన్, నందిక

కుమార్తెలు - అల్లుళ్లు
సీతాలక్ష్మి - దంటు విశ్వనాథ సూరి
మానస, మౌనిక
జ్యోతిలక్ష్మి - చుండి వెంకటనరసింహశర్మ
మేఘన, కౌశిక్

PDF Compressor Free Version






ఈ నెల 14వ తేదీ నెల్లూరులోని పోలీస్ అధికారుల సంక్షేమ సంఘం భవనంలో జరిగిన సంఘం సర్వసభ్య సమావేశంలో ప్రసంగిస్తున్న జిల్లా ఎస్పీ బి.వి.రమణకుమార్, పక్కన డీఎస్పీలు బాలవెంకటేశ్వరరావు, వెంకటనాథ్‌రెడ్డి తదితరులు

## నెల్లూరు కబుర్లు

# నెల్లూరుకు 'కళ' వచ్చింది





ఆరు నెలల తర్వాత నెల్లూరులో అడుగుపెట్టిన ఆనం వివేకాకు ఘనస్వాగతం పలికిన అభిమానులు

ఆరు నెలల తర్వాత నెల్లూరురూరల్ ఎమ్మెల్యే ఆనం వివేకానందరెడ్డి నెల్లూరు నేలపై అడుగుపెట్టాడు. అనారోగ్య కారణంగా ఆరునెలల నుండి ఆయన హైదరాబాద్‌లోనే మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఇంట్లో వున్నారు. నెల్లూరు గాలికి, నెల్లూరు తిండికి ఇంత కాలం ఆయన దూరంగా ఎప్పుడూ వుండింది లేదు. నెల్లూరుగాలి సోకనిదే వుండని ఆయన ఆరునెలల పాటు ఉగ్గబట్టాడు. మనిషి హైదరాబాద్‌లో వున్నా మనసంతా నెల్లూరుపైనే వుండేది. ఈ ఆరునెలలు హైదరాబాద్‌లో 'రోబో' జీవితమే గడిపాడు. సోమవారం ఉదయం ఛార్మినార్ ఎక్స్‌ప్రెస్‌లో నెల్లూరు రైల్వేస్టేషన్‌లో దిగిన ఆయనకు అభిమానులు ఘనస్వాగతం పలికారు. రైల్వేస్టేషన్ నుండే నేరుగా ఆయన తల్పగిరి రంగనాథస్వామి ఆలయాన్ని, ఇరుకళల పరమేశ్వరి అమ్మవారి దేవస్థానాన్ని, సండేమార్కెట్ సుబ్రహ్మణ్యంస్వామి గుడిని, మూలాపేట శివాలయాన్ని సందర్శించి పూజలు చేసారు. వివేకా వచ్చాడని తెలుసుకుని అభిమానులు, కాంగ్రెస్ కార్యకర్తలు, నగర ప్రముఖులు పెద్దసంఖ్యలో ఆయన నివాసానికి వచ్చి పరామర్శించారు. ఆయన సోమవారం సాయంత్రం సీమా సెంటర్ నుండి ఏ.సి. సెంటర్ వరకు ట్రంకురోడ్డులో ప్రతి షాపు వారిని పేరుపేరునా పలకరిస్తూ హల్‌చల్ చేసారు. ఆయన దెబ్బకు చాలాసేపు ట్రాఫిక్‌జాం అయ్యింది. ఏదేమైనా చాలారోజుల తర్వాత నెల్లూరు రోడ్లపై సందడి కనిపించింది.



పండితుల నుండి ఆశీర్వచనాలందుకుంటున్న వివేకానందరెడ్డి

# 'తాటి' చెట్టంత అభిమానం



వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరురూరల్ నియోజకవర్గ సమన్వయకర్త కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డికి వున్న టాప్‌టెన్ అభిమానుల్లో నెంబర్ వన్ అని చెప్పుకోదగ్గ వ్యక్తి మాజీ కార్పొరేటర్ తాటి వెంకటేశ్వర్లు. కోటంరెడ్డి రాజకీయంగా ఎన్నోసార్లు ఎదురుదెబ్బలు తిన్నా, ఆయనకు వెన్నుదన్నుగా వెన్నంటి నడిచాడు. కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డికి నెల్లూరు రూరల్ సీటొస్తే శ్రీశైలం మల్లన్న వద్దకు నడిచొస్తానని తాటి వెంకటేశ్వర్లు మొక్కుకుని వున్నాడట. ఈమధ్యనే కోటంరెడ్డిని నెల్లూరురూరల్ సమన్వయకర్తగా ఖరారు చేయడం జరిగింది. ఏవన్నా అనూహ్య పరిణామాలు జరిగితే తప్పితే రూరల్ అభ్యర్థి ఆయనే! దీంతో తాటి వెంకటేశ్వర్లు తన మొక్కు తీర్చుకోవడానికి మండే ఎండల్లో కాలికి చెప్పుల్లేకుండా శ్రీశైలంకు నడిచాడు. దాదాపు రెండువారాల పాటు నడిచి కలిగిరి, వింజమూరు, పామూరు, కనిగిరి, మార్కాపురంల మీదుగా శ్రీశైలంకు చేరుకుని మల్లన్న మొక్కు చెల్లించుకున్నాడు. ఈ కాలంలో కూడా ఇలాంటి అభిమానులు దొరకడం కోటంరెడ్డి అదృష్టమనుకోవాలి.

# బ్రాహ్మణ సేవాసంఘం అధ్యక్షుడిగా స్వయంపాకుల



నెల్లూరు నగరం బాలాజీ నగర్ బ్రాహ్మణ సేవాసంఘం అధ్యక్షునిగా స్వయంపాకుల శ్రీనివాసులు నియమితులయ్యారు. ఆదివారం బాలాజీనగర్ కురువాడ లలితమ్మ కల్యాణమండపంలో జరిగిన సంఘం కార్యవర్గ ఎన్నికల్లో శ్రీనివాసులు నియామకం ఏకగ్రీవమైంది. ఉపాధ్యక్షులుగా పాముల మురళీకృష్ణ, వంకా శ్రీహరి, ప్రసాద్‌రావు, కార్యదర్శిగా ఆసకపల్లి కామేశ్వరప్రసాద్, సంయుక్త కార్యదర్శులుగా తొండపి శ్రీనివాసరావు, ఆత్మకూరు రాంబాబు, కోశాధికారిగా శనగవరపు సత్యనారాయణమూర్తి, కార్యవర్గసభ్యులు కొంతమంది నియమితులయ్యారు.

# సరస్వతినిధికి విరాళం



కలెక్టర్ శ్రీధర్‌కు విరాళాన్నందజేస్తున్న అనిరుధ్‌కృష్ణ

పేద విద్యార్థులకు ఉన్నతవిద్యను అందించడంలో మిక్కిలి సహాయపడుతున్న సరస్వతి నిధికి నెల్లూరులో మాడరన్ ఐ హాస్పిటల్ మెడికల్ డైరెక్టర్ డా॥ ఓగిరాల గోపాలకృష్ణ రూ. 25వేలు విరాళంగా జిల్లా కలెక్టర్ బి.శ్రీధర్‌కు ఈ నెల 11న అందించారు. తన కుమారుడు చిరంజీవి అనిరుధ్‌కృష్ణ పుట్టినరోజు సందర్భంగా ఆయన ఈ మంచిపని చేసారు. చదివే కోరికున్నా, దానికి కావలసిన నిధిలేని వారికి సాయం అందించేలా జిల్లా కలెక్టర్ బి.శ్రీధర్ చేపట్టిన సరస్వతినిధి మన జిల్లాకే గర్వకారణమని డా॥ గోపాలకృష్ణ ఈ సందర్భంగా పేర్కొన్నారు. డా॥ గోపాలకృష్ణ, వారి కుటుంబసభ్యులను కలెక్టర్ అభినందించారు.

# నెల్లూరులో నిప్పుల వాన

నెల్లూరుజిల్లాలో గతవారం రోజులుగా రికార్డుస్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. భానుడు ఉగ్రరూపం దాల్చడంతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఎండతీవ్రతకు విద్యుత్తులేని సమయాల్లో చిన్నలు, పెద్దలు, వృద్ధులు విలవిలలాడుతున్నారు. ఇప్పటివరకు రికార్డుస్థాయిలో 44.4డిగ్రీలు ఉష్ణోగ్రత నమోదైంది. గతవారం రోజుల నుంచి ఉష్ణోగ్రతలు రోజురోజుకు ఎక్కువవుతున్నాయి. ఉదయం 7గంటల నుంచే సూర్యప్రతాపం విజృంభిస్తుండటంతో వీధుల్లోకి రావడానికే ప్రజలు భయపడుతున్నారు. ఉదయం 11గంటల తరువాత చాలా వరకు వీధులన్నీ నిర్మానుష్యమవుతున్నాయి. ఉదయం 9నుంచి 11గంటల వరకు, మధ్యాహ్నం 3నుంచి 4గంటల వరకు విద్యుత్ కోతలు విధించడంతో జనం తప్పనిసరి పరిస్థితుల్లో తప్ప బయటకు రావడానికే జంకుతున్నారు. కూలీ పనులకు పోవడానికి కూలీలు వెనుకాడుతున్నారు. జిల్లాలో చాలామంది వడదెబ్బకు గురై మృతిచెందారు. కూల్‌డ్రింక్‌షాపులు, ఐస్‌క్రీం పార్లర్లు, ప్రజలతో కిక్కిరిసి పోతున్నాయి. ఏసీలు ఉండే సినిమా థియేటర్లు ఫుల్ అవుతున్నాయి. ఎండదెబ్బకు కూలీలు రిక్షాకార్మికులు బాడుగలు దొరకక నానా అవస్థలు పడుతున్నారు. వాయుగుండం ప్రభావంతో సోమవారం ఎండతీవ్రత తగ్గడంతో ప్రజలు ఊపిరి పీల్చుకుంటున్నా...

● ఇరువర్గాల మధ్య వాగ్వాదం

# అమ్మవారి ఆలయంలో ఆర్యవైశ్యుల గోల



నెల్లూరు నగరం స్టోన్‌హౌస్‌పేటలో ఉన్న కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో ఇరువర్గాల మధ్య తీవ్రస్థాయిలో వాగ్వాదం చోటుచేసుకుంది. ఆదివారం పాత పాలకవర్గం నూతన పాలకవర్గం సభ్యుల మధ్య ఈ వివాదం జరిగింది. పాతపాలక మండలి గడువు ఈ ఏడాది జనవరికి ముగిసింది. అయినా నాలుగునెలలుగా పాత కార్యవర్గమే పరిపాలన సాగిస్తోంది. కాగా నెల్లూరు జిల్లా అర్బన్ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు ముక్కాల ద్వారకానాథ్ ఆధ్వర్యంలో నూతన కమిటీని ఇటీవల ఎన్నుకున్నారు. 11వ తేదీ వారు ఆలయానికి వచ్చి నూతనకమిటీ నియామకపత్రాన్ని పాతకమిటీ సభ్యులకు అందజేయాలని పూజలు జరుపుతున్నారు. ఈ క్రమంలో ఇరువర్గాల మధ్య గొడవ జరగడంతో పోలీసులు రంగప్రవేశం చేసి నూతన కమిటీ వారిని పంపించేశారు. ఈ విషయమై ఆదివారం సాయంత్రం పాతకమిటీ ఆలయ ప్రాంగణంలో విలేకర్ల సమావేశం ఏర్పాటుచేసింది. మాజీకార్యదర్శి మంచికంటి శ్రీనివాసులు మాట్లాడుతూ బైలా పద్ధతులు, నూతన కమిటీ ఎంపిక తదితరాలపై వివరించారు. ఇంతలో నూతన కమిటీ ఆలయ ప్రాంగణానికి చేరుకున్నారు. విలేకర్ల సమావేశం ఏర్పాటు చేయాల్సిన అవసరం ఏమిటని, ఆలయం బాధ్యతలు తమకు అప్పగించడానికి మీకేందుకు బాధని ప్రశ్నించారు. దీంతో ఇరు కమిటీసభ్యుల మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. పలువురు సర్దిచెప్పాలని చూసినా గొడవ ఆగలేదు. బైలా పద్ధతి, జీఓల ప్రకారం వెంటనే పాతకమిటీ తప్పుకోవాలంటూ నూతన కమిటీసభ్యులు అడుగుతుండగా కేసులు ఉన్నాయి, నూతన కమిటీ ఎన్నిక సరిగా జరగలేదంటూ మాజీ కమిటీ సమాధానమిచ్చింది. ఇరువర్గాల బైలాను చదువుకున్నారు. ఇంతలో అక్కడకు పోలీసులు చేరుకుని ఇరువర్గాలకు సర్దిచెప్పారు. చివరికి మాజీ కమిటీసభ్యులు వారితో మాట్లాడుతూ ప్రస్తుతం అమ్మవారి జన్మదిన మహోత్సవాలు జరుగుతున్నాయని, అవి అయిపోయాక ఆలయాన్ని అప్పగిస్తామని హామీ ఇవ్వడంతో వివాదం సద్దుమణిగింది.

### నూతన పాలకవర్గం...

నెల్లూరు నగరం జేసీస్ భవనంలో 11వ తేదీ శ్రీ కన్యకాపరమేశ్వరి దేవస్థానం నూతన పాలకవర్గాన్ని ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. కన్యకాపరమేశ్వరి నూతన పాలకవర్గ కమిటీ ఛైర్మన్‌గా పి.పార్థసారధి కార్యదర్శిగా పెసల మోహన్‌రావు, కోశాధికారిగా నీలిశెట్టి వెంకటేశ్వరప్రసాద్, కమిటీ సభ్యులుగా తాటిపర్తి శ్రీనివాసులు, నాగేశ్వరరావు, కొండా శ్రీనివాసులు, శేగు చెంగయ్య, పరకోట సుబ్బయ్య, మెంటా అనిత ఎంపికయ్యారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు కాళ్లకూరి రామనాగేశ్వరరావు నెల్లూరుజిల్లా అర్బన్ ఆర్యవైశ్య అధ్యక్షుడు ముక్కాల ద్వారకానాథ్, రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి దరిశిశ్రీనివాస్, రాష్ట్ర కార్యదర్శి కోటగురుబ్రహ్మం, అధికార ప్రతినిధి తిరువీధి ప్రకాశరావు తదితరులు పాల్గొని నూతన పాలకవర్గానికి నియామకపు పత్రాలను అందజేసారు.

PDF Compressor Free Version



# అన్నదాతలకు దండిగా రుణాలు

## రాష్ట్ర ఆర్థికశాఖామంత్రి ఆనం

సింహపురి సమాచారం

రాష్ట్ర ప్రభుత్వం రైతుల ప్రయోజనాన్ని దృష్టిలో పెట్టుకొని ఈ ఆర్థిక సంవత్సరంలో కోటిమంది రైతులకు 52వేల కోట్లు మేర రుణాలు అందించేందుకు లక్ష్యంగా పెట్టడం జరిగిందని రాష్ట్ర ఆర్థికశాఖామంత్రి ఆనం రామనారాయణరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం పొదలకూరు మండల కేంద్రం, జిల్లా పరిషత్ హైస్కూల్‌లో జరిగిన రైతుసదస్సులో మంత్రి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో కేవలం 6వేల కోట్ల మేర 11.50శాతం వడ్డీతో రుణాలు ఇవ్వగా, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తరువాత కేంద్ర ప్రభుత్వం పావలా వడ్డీతో రుణాలు అందచేయడం జరిగిందని, తదుపరి గత సంవత్సవం 46వేల కోట్ల మేర వడ్డీలేని రుణాలను అందించడం జరిగిందన్నారు. 1999సం॥లో కేవలం 1.65లక్షల ఎకరాలకు సాగునీరు అందించడం జరిగిందని గత సంవత్సరం 3.50లక్షల ఎకరాలకు సాగునీరు అందించేందుకు లక్ష్యంకాగా అంతకంటే ఎక్కువ ఆయకట్టులో రైతులు నాట్లు వేసుకున్న సందర్భంలో పూర్తిస్థాయిలో ఒకసెంటు భూమి కూడా ఎండిపోకుండా ఐ.ఏ.బి సమావేశం నిర్వహించి ఇరిగేషన్, రెవెన్యూ, ట్రాన్స్‌కో వ్యవసాయ శాఖాధికారుల సమన్వయంతో సమీక్షించి దాదాపు 4.5లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందించి అనుకున్నదానికంటే అధిక దిగుబడులు పండించుకోవడం జరిగిందన్నారు. పొదలకూరు ప్రాంతంలో 2,600ఎకరాల చివరి భూములకు సాగునీరు అందించేందుకు స్థానిక శాసనసభ్యుల సహకారంతో ముఖ్యమంత్రి ఆమోదంతో కండలేరు జలాశయం నుండి 30ట్రాక్టర్ల ద్వారా లిఫ్ట్ చేసి సాగునీరు అందించి పూర్తిగా పండించడం జరిగిందన్నారు. సర్వేపల్లి శాసనసభ్యులు ఆదాల ప్రభాకరరెడ్డి అధ్యక్షత వహించిన ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ బి.శ్రీధర్, శాసనమండలి సభ్యులు వాకాటి నారాయణరెడ్డి, జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ అధ్యక్షులు ధనుంజయరెడ్డి, జిల్లా మార్కెటింగ్ అధ్యక్షులు సుమంత్‌రెడ్డి, అదనపు జాయింట్ కలెక్టర్ పెంచలరెడ్డి, నెల్లూరు ఆర్.డి.ఓ కె.మాధవీలత, వ్యవసాయశాఖ జె.డి.సుబ్బారావు, ఉద్యానవనశాఖ ఏ.డిలు శ్రీనివాసరావు, వి.ఎస్.ధర్మజ, యస్.పి.కార్పొరేషన్ ఇ.డి.సోమయ్య, బి.సి.కార్పొరేషన్ ఇ.డి వి.కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



ఈ నెల 14వ తేదీన పొదలకూరులో జరిగిన రైతుసదస్సులో పాల్గొని ఎద్దులను పరిశీలిస్తున్న రాష్ట్ర ఆర్థికశాఖా మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, సర్వేపల్లి శాసనసభ్యులు ఆదాల ప్రభాకర్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ బి.శ్రీధర్

# జిల్లాలో క్లీన్‌స్వీప్ చేస్తాం

## :-: వైయస్సార్సీపీ జిల్లా కన్వీనర్ మేరిగ మురళీధర్ :-:



సమావేశంలో పాల్గొన్న మురళీధర్, రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి తదితరులు

వైయస్సార్సీపీ జిల్లా కన్వీనర్ మేరిగ మురళీధర్ ఈ నెల 13న కావలి పట్టణంలోని వైయస్సార్సీపీ కావలి నియోజకవర్గ సమన్వయకర్త రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి నివాసంలో విలేకరుల సమావేశంలో పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ వైయస్సార్సీపీలో నాయకులకు, కార్యకర్తలకు సముచిత స్థానం లభిస్తుందని, దానికి తానే ప్రత్యక్ష నిదర్శనమన్నారు. తాను సమన్వయంతో పనిచేస్తూ ప్రతి ఒక్కరిని కలుపుకుపోతానని, పార్టీ పటిష్ఠతకు భంగం కలగకుండా చూస్తానన్నారు. వచ్చే ఎన్నికల్లో జిల్లాలోని పది శాసనసభ స్థానాలను వైయస్సార్సీపీ గెలుచుకుంటుందని, నాయకులు, కార్యకర్తల సహకారంతో గ్రామస్థాయి నుంచి పార్టీ బలోపేతానికి కృషిచేస్తానని తెలిపారు. తెలుగుదేశంపార్టీ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు పాదయాత్రలో కిలోమీటరుకు ఒక నాయకుడు చొప్పున ఆ పార్టీని వీడి వెళ్లిపోతున్నారని, ఎన్నికల్లో టిడిపికి చోటు దక్కదని వారి ఉద్దేశ్యమని పేర్కొన్నారు. దివంగత మహానేత వైయస్సార్ ముఖ్యమంత్రిగా వున్నప్పుడు ధరలు అదుపులో వుండి సామాన్యుడికి భారం లేకుండా వుండిందని, కాని నేటి పాలకులు ధరలు నియంత్రణ చెయ్యలేక చతికిలపడి సామాన్య ప్రజలను బాధలు పెడుతున్నారన్నారు. కక్ష సాధింపు చర్యల్లో భాగంగానే కాంగ్రెస్ నాయకులు జగన్‌కు బెయిల్ రాకుండా సిబిఐని ఆడిస్తున్నారన్నారు. రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ తమ పార్టీ అధ్యక్షుడు వై.యస్. జగన్మోహన్‌రెడ్డి బడుగు, బలహీనవర్గాలకు చెందిన మేరిగ మురళీధర్‌ను జిల్లా కన్వీనర్‌గా నియమించడం సంతోషంగా వుందని తెలిపారు. మురళీధర్ నాయకత్వంలో పార్టీ నాయకులు, కార్యకర్తల సమిష్టికృషితో పార్టీని పటిష్ఠపరుస్తూ అన్ని అసెంబ్లీ స్థానాల్లో గెలుపు గుర్రమెక్కిస్తామన్నారు. సమావేశంలో నాయకులు పాండురంగారెడ్డి, సన్నపురెడ్డి వెంకటసుబ్బారెడ్డి, చంద్రమౌళిరెడ్డి, చేవూరి వెంకటరామిరెడ్డి, పద్మనాభరెడ్డి, పాల్గొన్నారు.

# ఉత్తుత్తి సదస్సులతో ఉపయోగమేంటి?



కలెక్టర్ బి.శ్రీధర్‌తో చర్చిస్తున్న కాకాణి గోవర్ధన్‌రెడ్డి

దివంగత మహానేత వై.యస్.రాజశేఖరరెడ్డి ప్రవేశపెట్టిన రైతు సంక్షేమ పథకాలను తుంగలో తొక్కిన నేటి సియం కిరణ్ కుమార్‌రెడ్డి పాలనలో రైతుసదస్సుల ద్వారా రైతులకు ప్రయోజనమేమీ వుండదని వైయస్సార్సీపీ సీఈసీ సభ్యుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ నెల 13న జిల్లా కలెక్టర్ బి.శ్రీధర్‌ను కలిసి రైతు సమస్యల పరిష్కారానికి తగుచర్యలు తీసుకోవాలని కోరుతూ వినతిపత్రం సమర్పించిన ఆయన విలేకరులతో మాట్లాడారు. ఇప్పుడు జరుగుతున్న రైతుసదస్సుల్లో ఊకదంపుడు ఉపన్యాసాలకే ప్రజాప్రతినిధులు పరిమితమవుతున్నారని, వాటి వల్ల రైతులకేమీ ప్రయోజనం కలగడంలేదని అన్నారు. ఆనాడు వై.యస్. 7గంటలు ఉచిత కరెంటిస్తే నేడు రెండుగంటలు కూడా రైతాంగానికి ఉచిత కరెంటివ్వడంలేదని పేర్కొన్నారు. రూ.1800 కోట్ల విద్యుత్ బకాయిలను వై.యస్. మాఫీ చేస్తే నేటి సీయం కిరణ్ రకరకాలుగా కరెంట్‌ఛార్జీలను పెంచుతూపోతున్నాడన్నారు. కండలేరు స్లూయిస్ హైలెవల్‌లో వుండడంతో జలాశయాల నుంచి నీరు వదిలేందుకు వీలు కావడంలేదని, అందుకని శాశ్వత ఎత్తిపోతల పథకం నిర్మించాలని కోరారు. సర్వేపల్లి కాలువ నుంచి ఈదూరు, కోడూరు చెరువులకు వచ్చే జాఫర్‌సాహెబ్ కెనాల్ లైనింగ్ పనులు వేగవంతం చెయ్యాలన్నారు. మినుము రైతులకు దళారులు బహిరంగ మార్కెట్‌లో రూ.3200లు మాత్రమే చెల్లిస్తున్నారని, వెంటనే ప్రభుత్వం మద్దతు ధర రూ.4000కి కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ముత్తుకూరు మండలంలో ఏపిజెన్‌కో నిర్మించనున్న యాష్‌పాండ్ వల్ల చుట్టుపక్కల గ్రామాలు మామిడిపూడి, పైనాపురం, వరకవిపూడిలు బూడిదతో నిండిపోకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

కార్యక్రమంలో వైయస్సార్సీపీ నేతలు టంగుటూరు పద్మనాభరెడ్డి, చిల్లకూరు సుధీర్‌రెడ్డి, వీపీ పద్మనాభరెడ్డి, భాస్కర్‌గౌడ్, బిరుదవోలు శ్రీకాంత్‌రెడ్డి, కోడూరు ప్రదీప్ కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# పారిశ్రామిక ప్రగతికి ఇదో మైలురాయి

## తిరుపతి ఎంపి చింతామోహన్



నెల్లూరుజిల్లా దుగరాజపట్నంలో పోర్టు ఏర్పాటు అయితే జిల్లా పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతుందని తిరుపతి ఎంపి చింతామోహన్ పేర్కొన్నారు. 11వ తేదీ నెల్లూరు డ్వామా కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడుతూ జిల్లా వ్యవసాయపరంగా అభివృద్ధి చెందిందిగాని పారిశ్రామికంగా ఎలాంటి అభివృద్ధికి నోచుకోలేదన్నారు. వసతులు సక్రమంగా లేవని వచ్చిన పరిశ్రమలు వెను తిరుగుతున్నాయన్నారు. 60ఏళ్ళలో మైకా, చక్కెర కర్మాగారాలు మినహా ఎలాంటి పారిశ్రామిక అభివృద్ధి జరగలేదన్నారు. నాలుగేళ్ళుగా దుగరాజపట్నంలో పోర్టు ఏర్పాటుకోసం ఎన్నో ప్రయత్నాలు చేశామన్నారు. కేంద్రం నుంచి వచ్చిన బృందానికి సరైన అవగాహన లేకపోవడంతో పాటు కొంతమంది దుగరాజపట్నంలో పోర్టు రాకుండా ప్రయత్నించడంతో రామాయపట్నంలో పోర్టు ఏర్పాటుకు సిఫార్సు చేశారన్నారు. ప్రధానమంత్రితో దుగరాజపట్నంలో పోర్టు ఏర్పాటు విషయమై పలుమార్లు సంప్రదింపులు జరిపామన్నారు. దీని ఫలితంగానే ప్రధానమంత్రి కేబినేట్ సమావేశంలో ప్రతిపాదించినట్లు తెలిపారు. 17వ శతాబ్దం నుంచే దుగరాజపట్నంలో పోర్టు ఉండేదని డచ్, బ్రిటీష్ ప్రభుత్వాలు ఈ పోర్టు ద్వారా రాకపోకలు సాగించేవారన్నారు. చైనా నుంచి వచ్చిన యాత్రికులు దుగరాజపట్నం పోర్టులో దిగి బౌద్ధ మత ప్రచారం చేసినట్లు చరిత్ర చెబుతోందన్నారు. పోర్టు ఏర్పాటుతో నెల్లూరు-తిరుపతి కారిడార్ కూడా అభివృద్ధి చెందడంతో పాటు జిల్లా పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతుందన్న వాస్తవాలు తెలిపిన మీదట కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపిందన్నారు. దేశంలోని నౌకాశ్రయాలకు స్థల సమస్య వుందని కాని దుగరాజపట్నం పోర్టుకు ఆ సమస్య లేదన్నారు. ఇప్పటికే దుగరాజపట్నంలో పోర్టుకు ఐదువేల ఎకరాల ప్రభుత్వ భూమి ఉందన్నారు. పోర్టు ఏర్పాటయితే పదిలక్షల మందికి ఉద్యోగాలు వచ్చే అవకాశముందన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన విధంగా 8వేల కోట్లు కాకుండా పూర్తి అయ్యేనాటికి 25వేల కోట్లు వ్యయం కానుందన్నారు.

ఈ సమావేశంలో కాంగ్రెస్‌పార్టీ దొరవారిసత్రం మండలం అధ్యక్షుడు వెంకటాచలంరెడ్డి పిసిసి కార్యదర్శి ఉడతా వెంకట్రావ్‌యాదవ్ ముదిరాజ్ సంఘం జిల్లా అధ్యక్షుడు రఘురాం ముదిరాజ్ పాల్గొన్నారు.

# శ్రీసిటీలో రెండు ఫ్యాక్టరీలకు భూమిపూజ



వేగవంతంగా అభివృద్ధిని సాధిస్తున్న అంతర్జాతీయ వాణిజ్య నగరం శ్రీసిటీలో ఈ నెల 13న ఏకకాలంలో రెండు ఫ్యాక్టరీలు భూమిపూజలు జరుపుకున్నాయి. నాణ్యత కలిగిన పేపర్ తయారీలో ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన విటల్ పేపర్ ప్రొడక్ట్స్ కంపెనీ భారత్‌లో తొలిసారిగా తమ ఉత్పత్తులు ప్రారంభించడానికి రూ.300కోట్ల పెట్టుబడితో ఈ రెండు ఫ్యాక్టరీలకు శ్రీకారం చుట్టింది. శ్రీసిటీలోని సిద్ధమ అగ్రహారం, చెర్వి ప్రాంతాల్లో వేర్వేరుగా జరిగిన భూమిపూజ కార్యక్రమాల్లో కంపెనీ ఛైర్మన్ కృష్ణన్‌వరదరాజన్, యం.డి. శశిరవడులు పాల్గొనగా శ్రీసిటీ డైరక్టర్ ముకుందరెడ్డి తదితరులు వారికి స్వాగతం పలికారు. శ్రీసిటీలో తమ కంపెనీలు ఏర్పాటు చేస్తున్న విటల్ పేపర్ ప్రొడక్ట్స్ యాజమాన్యానికి శ్రీసిటీ యం.డి రవిసన్నారెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. బహుళజాతి కంపెనీలు ఏర్పాటు చేయడం వల్ల శ్రీసిటీ ఖ్యాతి దశదిశలా వ్యాపిస్తుందని, స్థానికంగా నిరుద్యోగ సమస్య తీరే అవకాశం వుందని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ రెండు ఫ్యాక్టరీలలో దాదాపు 150మందికి ఉద్యోగ అవకాశం వుందని తెలిపారు.

PDF Compressor Free Version


K



## కదంబం

### "నానీలు"

కందిపాటి గోపాలరావు
నెల్లూరు. 9652174640.



నరుకుతున్నా
చెట్టు తిరగబడటంలేదు
చరిత్ర
తిరగ రాద్దామంటే.



విల్లంబులు కూడా
కావొచ్చు
కొమ్ములున్నది
కాయటానికే కాదు



మేయటానికి
పశువే కానక్కర్లేదు
కంచెలా
మా మంచి మనిషున్నాడు



ఆమెకు
అందరూ ఆడపిల్లలే
కొమ్మ
విరగబూసినట్టు



'నిర్భయ'
స్వర్గానికెళ్ళనంది
ఇంద్రుడిదీ
నేరచరిత్రేగా

## టీవీఎస్ కల్యాణసదన్‌లో ఆది-శంకర జయంతి



జగద్గురు ఆదిశంకర జయంత్యుత్సవాలు నెల్లూరు ట్రంక్ రోడ్డులోని టీవీఎస్ కల్యాణసదన్‌లో ఈనెల 15న పినాకినీ విద్యా పీఠం ఆధ్వర్యంలో ప్రారంభమయ్యాయి. ఉదయాన్నే లక్ష్మీగణపతి హోమం చేసిన వేదపండితులు భక్తులకు ప్రసాదం పంపకం చేసారు. తదుపరి మహాన్యాసపూర్వక రుద్రాభిషేకాలు, పుష్పార్చన, నామార్చనలు జరిపారు. సాయంత్రం విష్ణు, లలితా సహస్ర నామార్చన, ప్రదోషకాల పూజలు జరిపారు. తిరుపతిలోని కేంద్ర వేదసంస్కృత విశ్వవిద్యాలయ పూర్వ ఉపకులపతి సన్నిధానం సుదర్శనశర్మ ఉపనిషద్ ఉద్బోధ చేసారు. పినాకినీ విద్యాపీఠం అధ్యక్షుడు స్వయంపాకుల శ్రీనివాసులు, కార్యదర్శి దూబగుంట ప్రభాకరరావు, సివిఎల్ లక్ష్మీనరసింహం, డాక్టర్ యనమండ్ర నాగదేవీప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## కలెక్టరేట్ యూనిట్ అధ్యక్షుడు రాంభూపాల్‌రెడ్డి

ఏపీ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ కలెక్టరేట్ యూనిట్ అధ్యక్షుడిగా కె.రాంభూపాల్‌రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కలెక్టరేట్‌లోని రెవెన్యూ అసోసియేషన్ కార్యాలయంలో కలెక్టరేట్ శాఖ ఎన్నికలు జరిగాయి. ఎన్నికల అధికారిగా కె.చంద్రశేఖర్ వ్యవహరించారు. అసోసియేట్ అధ్యక్షుడిగా పి.శ్రీనివాసులు, ఉపాధ్యక్షులుగా జి.రవికుమార్, పిఎల్.నరసింహం, సులోచన, కార్యదర్శిగా ఎంఎం ప్రసాదరావు, జాయింట్ సెక్రటరీలుగా ఎస్‌ఎం రఫీ, ఎ.శ్రీనివాసులు, టి.సంతోష్‌బాబు, ట్రెజరర్‌గా ఏవీ రమణారావు, ఈసీ మెంబర్లుగా వై.ప్రభాకరరావు, జి.అరుణ కుమార్, డిసి మెంబర్లుగా ఆర్.అజీబుల్లాఖాన్, యూఎస్ వేణు గోపాల్, డి.కె.సుబ్బరాయుడు ఎన్నికయ్యారు.

## గల్పిక: రైల్లో నుండి దూకిన వివేకా

మే 12వ తేదీ ఉదయం 9గంటలు. బాంబుపేలుళ్ల బాధలు లేని భాగ్యనగరంలో ఆర్థికమంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఇల్లు. ఆరు నెలలుగా ఆ ఇంట్లోనే వుండి విశ్రాంతి తీసుకుంటున్న స్టైల్ ఆఫ్ సింహపురి, నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే ఆనం వివేకానందరెడ్డి(63+) అప్పుడే స్నానం చేసి ముస్తాబై తన గది నుండి బయటకొచ్చాడు. గోడ గడియారం వంక చూసాడు. 9గంటలా 5 నిముషాలు. తన చేతి గడియారం వంక చూసాడు. అందులోనూ అదే టైం. ప్రవీణ్... అంటూ పి.ఏను కేకేసాడు. ప్రవీణ్ వచ్చాడు. ఛార్మినార్ ఎన్ని గంటలకు అని వివేకా అడిగాడు. సాయంత్రం 6గంటలకు సార్ అని ప్రవీణ్ చెప్పాడు. వివేకా వేళ్ల మీద లెక్కలు వేసి... అబ్బా ఇంకా 9గంటలు వుంది... ఆ ట్రైనేదో ఇప్పుడే వుంటే బాగుండేది కదా అని అనుకున్నాడు. కొడుకు ఏ.సి.సుబ్బారెడ్డి వచ్చి... నాన్న టిఫిన్ చేద్దురు రండి అని అడిగాడు. ఈరోజు నాకు ఆకలిగా లేదు... ఆనందంతో నా కడుపంతా నిండిపోయి వుంది. మధ్యాహ్నం భోజనం కూడా అక్కరలేదు. రేపు ఒకటేసారి నెల్లూరులో చేపల పులుసు, మటన్‌బిర్యానీ తినాలి అని గోడ గడియారం వంకే చూస్తూ కుర్చీలో కూర్చున్నాడు. ఆయన మైండ్ సెట్‌ను మార్చేద్దామని ప్రవీణ్ టీవీని ఆన్ చేసి 'ఎఫ్' ఛానెల్ పెట్టాడు. ఆ ఛానెల్‌లో గోచి గుడ్డలు ధరించి ర్యాంప్‌పై నడుస్తున్న మోడల్స్‌ను చూసి వివేకా పక్కనేవున్న చాట్ల నరసింహారావుతో... చూడు అయ్యోరు... మనది పేద దేశమంటారు, మనకు ఒంటినిండా కప్పుకోవడానికి గుడ్డలన్నా వున్నాయి. ఈ ఫారిన్ వాళ్లకు అవి కూడా లేక ఎలా తిరుగుతున్నారో చూడు... అంటూ సానుభూతిని వ్యక్తం చేసాడు. అలా చింపిరి గుడ్డలతో ర్యాంప్‌పై తిరుగుతున్న మోడల్స్‌ను జాలి హృదయంతో చూస్తూ చూస్తూనే ఆయన నిద్రలోకి జారుకున్నాడు.

★★★★★

హైదరాబాద్ నుండి బయలుదేరిన ఛార్మినార్ ఎక్స్‌ప్రెస్ పట్టాల మీద పరుగులు తీస్తూ అప్పుడే కావలి దాటింది. ఏ.సి భోగీలో పడుకుని వున్న వివేకా కళ్లు తెరిచాడు. అంతా చీకటిగా వుంది. ట్రైన్ ఇంకా విజయవాడను కూడా దాటినట్లు లేదు... అని కళ్లు మూసుకున్నాడు. రెండు నిముషాలకే పి.ఏ ప్రవీణ్ వచ్చి... సార్, నెల్లూరు రాబోతుంది. లేచి మేకప్ కానివ్వండన్నాడు. అప్పుడే నెల్లూరొచ్చిందా... ఇంకా చీకటిగా వుందేంటని వివేకా అడిగాడు. ప్రవీణ్ దానికి ఏం సమాధానం చెప్పకుండా ఆయన కళ్లకున్న నల్లద్దాలను తీసి పక్కన పెట్టాడు. దాంతో వివేకాకు చీకటిపోయి వెలుగు కనిపించసాగింది. ట్రైన్ అప్పుడే తలమంచి దాటింది. ఆరు నెలల తర్వాత నెల్లూరును చూడబోతున్నాననే ఆత్రుత... పరిస్థితికి తగ్గట్లుగా వుంటుందని వివేకా "ఎన్నాళ్లో వేచిన ఉదయం... ఈనాడే ఎదురవుతుంటే... ఇంకా తెలవారదేమీ ఈ చీకటి విడిపోదేమీ" అనే పాట పాడాడు. పి.ఏ ప్రవీణ్ దానిని విని తరించాడు. ఇంతలో రైలు పెన్నా బ్రిడ్జి మీదుగా వెళ్లసాగింది. అప్పుడే వివేకాకు 'సమరసింహారెడ్డి'లో బాలకృష్ణ ట్రైన్ దిగే సీన్ గుర్తుకొచ్చింది. ఆ లెవల్లోనే దిగాలనుకుని గేటు వద్ద నిలుచున్నాడు. బాలకృష్ణ లెవల్లోనే కళ్లకు అద్దాలు పెట్టాడు. మనిషి మునుపటి కంటే గ్లామర్‌గా తయారయ్యాడు. ట్రైన్ మూడో నెంబర్ ఫ్లాట్‌ఫాం మీదుగా పోతుంది. వివేకా కోసం ఆనం విజయకుమార్‌రెడ్డి, నన్నపరెడ్డి పెంచలరెడ్డి, భానుశ్రీ, పిండి సురేష్, మేకల నరేంద్ర, చక్రవర్తి, పుట్టా రామకృష్ణారెడ్డి... ఇంకా ఎందరో ఎదురుచూస్తున్నారు. భోగీ తలుపు వద్ద నిలుచున్న వివేకా వారికి చేయి వూపుతూ ఇంకా ఆగని ట్రైన్‌లో నుండి ఫ్లాట్‌ఫాం మీదకు దూకాడు. కాని వచ్చిన వాళ్లెవ్వరూ వివేకాను పట్టించుకోలేదు. పిండి సురేష్, పెంచలరెడ్డిలు భోగీలోకి ఎక్కి వివేకన్నా... వివేకన్నా అంటూ కేకలేస్తున్నాడు. నేను పక్కనే వుంటే వీళ్లంతా భోగీలో వెదుకుతున్నదెవరి కోసమనే అనుమానం వివేకాకు వచ్చింది. అక్కడే వున్న మేకల నరేంద్రతో... వాళ్లు లోపల వెదికేది ఎవరికోసమని అడిగాడు. మా ప్రియతమ నాయకుడు ఆనం వివేకానంద రెడ్డి కోసమని నరేంద్ర చెప్పాడు. దానికి వివేకా... నన్ను పక్కనే పెట్టుకుని వాళ్లు భోగీ అంతా కలతిరగడమెందుకోనని అన్నాడు. అప్పుడు నరేంద్ర ఆయన్ను ఎగాదిగా చూసి... ఆయనే వివేకా అని గుర్తుపట్టి సురేషన్నా... ఇదిగో మన వివేకా అని కేకేసాడు. ఆ అరుపుతో అందరూ అక్కడ గుమికూడారు. వివేకా వుండి... ఏం సూరి(పిండి) నన్ను గుర్తు పట్టలేదా అని అడిగాడు. దానికి సురేష్... మీరు ఆరు నెలలుగా హైదరాబాద్‌లో పేషంట్‌గా వున్నారు కదన్నా... గడ్డం మాసిపోయి, జుట్టు తెల్లబడి, ముఖం పీక్కుపోయి, ట్రైన్‌లో నుండి కూడా అతికష్టం మీద దించాల్సి వస్తుందనుకునే అంచనాల్లో మేమున్నాం... మీరేమో 'సమరసింహారెడ్డి' సినిమాలో బాలకృష్ణ మాదిరిగా ఎంట్రీ ఇస్తిరి... మీ గెటప్ చూస్తే ఆరు నెలల పేషంట్‌లాగా వున్నారా? అప్పుడే సినిమా షూటింగ్ నుండి వచ్చిన హీరోలాగున్నారని అన్నాడు. మీ వాలకం చూస్తుంటే నేను మాసిపోయిన గడ్డం, చీకిపోయిన జుట్టు, చింకిపోయిన గుడ్డలతో రానందుకు బాధపడుతున్నట్లుందే అని వివేకా అడిగాడు. అందుకు పక్కనేవున్న పెంచలరెడ్డి... అయ్యో అలాంటిదేమీ లేదన్నా, అలాంటివి వుంటే మనసులో పెట్టుకుంటాం గాని, బయటకు చెబుతామా ఏంటి అని అన్నాడు. అది కూడా నిజమేగా అని వివేకా ఏదో మరచిపోయినట్లు... 'ఇంద్ర' సినిమాలో చిరంజీవి మాదిరిగా ఫ్లాట్‌ఫాం మీదకు వంగి గచ్చును ముద్దుపెట్టుకోబోయాడు. చాట్ల నరసింహారావు వుండి... ఏం చేస్తున్నార్సార్ అని అడిగాడు. 6నెలల తర్వాత నెల్లూరు కొచ్చాను కదా... నెల్లూరు నేలతల్లిని ముద్దాడుతున్నాను అని చెప్పాడు. అందుకు చాట్ల... మీ నేలతల్లి భక్తి బాగానే వుందిగాని... ఇక్కడ ఎవరంటే వాళ్లు ఉమ్మేస్తుంటారు. ఈ సాహసకార్యమేదో బయట చేసుకుందురు రండి అని బయటకు తీసుకొచ్చాడు. స్టేషన్ బయట సింబాలిక్‌గా వుంటుందని వివేకా ప్రచారరథంలో "నా జన్మభూమి ఎంతో అందమైన దేశము... నా ఇల్లు అందులోన కమ్మనైనా ప్రదేశము" అనే పాట పెట్టగా వివేకా క్రిందకు వంగి నెల్లూరు నేలను ముద్దాడాడు. తర్వాత 'ఆది' సినిమాలో ఎన్టీఆర్‌లాగా, పెన్నానీళ్లు తాగాలనిపించిందాయనకు. వెంటనే అటుగా వాటర్ క్యాన్ ఎత్తుకెళుతున్న ఓ మహిళను పిలిచి... నాకు కాసిన్ని నీళ్లు పోయమ్మ అని దోసిలి పట్టాడు. దానికామె... పాతిక రూపాయలు పెట్టి కొన్నాను క్యాను... నీలాంటి వాళ్లకు ఫ్రీగా పోయడానికి కాదు అంటూ చకచకా వెళ్లిపోయింది. ఇలాగైతే లాభంలేదనుకుని జీపు ఎక్కి నేరుగా పెన్నా వద్దకు పోయాడు. అక్కడ నీటి మడుగులో ఓ రజకుడు బట్టలు ఉతుకుతున్నాడు. ఆ మడుగులోని నీటినే వివేకా దోసిట్లోకి తీసుకుని తాగబోయాడు. నన్నపరెడ్డి పెంచలరెడ్డి అడ్డుకుని... అసలే నువ్వు పేషంట్‌వి, ఈ నీళ్లు తాగి రోగాలు కొనితెచ్చుకోకు... అని అన్నాడు. కాదు నేను చిన్నతనం నుండే ఈ నీళ్లు తాగి పెరిగాను. ఈ నీళ్లే నాలో రోషం, పౌరుషం పెంచాయి. కాబట్టి ఈ నీళ్లను తాగకుండా నన్నెవరూ అడ్డుకోలేరు అని బలవంతంగా తాగబోయాడు. ఈ నీళ్లు తాగితే మళ్లీ మీరు హైదరాబాద్‌లోనే వుండాల్సి వస్తుంది. మాకు దూరమవుతారు... ఈ నెల్లూరు ప్రజలకు ఎలాంటి ఎంటర్‌టైన్‌మెంట్ లేక అనాథలవుతారు అని పెంచలరెడ్డి వారించసాగాడు. ఆ వాదులాటలో వివేకాకు కోపం వచ్చి... నేను పెన్నానీళ్లు తాగాల్సిందే తాగాల్సిందే అని కేకలు వేయసాగాడు. ఆ కేకలు విని ఇంట్లో లోపల వున్న ఏ.సి.సుబ్బారెడ్డి పరుగెత్తుకుంటూ వచ్చి... ఏమైంది నాన్న అంటూ వివేకాను కదిపాడు. వివేకా అప్పుడే కళ్లు తెరిచాడు. తీరాచూస్తే... మంత్రి ఇంట్లోనే కుర్చీలో కూర్చుని నిద్రపోయాడు. ఆ నిద్రలోనే నెల్లూరుకు పోయినట్లు కల కన్నాడు. అప్పటిదాకా జరిగిందంతా కల అని తెలుసుకోవడానికి ఆయనకు అరగంట పట్టింది. అప్పుడు గడియారం వంక చూసాడు. సాయంత్రం 5గంటలు... లేచిందే లేడికి పరుగు అన్నట్లు సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌కు బయలుదేరాడు ఛార్మినార్ ఎక్స్‌ప్రెస్ ఎక్కడానికి!

## కనులపండువగా శ్రీరామానుజుల ఉత్సవం


నెల్లూరు శ్రీరంగనాథస్వామి ఆలయంలోని శ్రీరామానుజుల అవతారోత్సవం ఈనెల 14న వైభవంగా జరిగింది. ప్రభాతవేళలో శోభాయమానంగా పుష్పాలంకరణతో శ్వేత ఛత్రాల నడుమ పురవీధుల్లో స్వామిని ఊరేగించారు. ఆలయానికి తిరిగివచ్చిన స్వామికి రంగనాయకుల సన్నిధి, వెంకటేశ్వరుని సన్నిధి, ఆండాళ్ళ సన్నిధిల్లో స్వాగతవచనాలతో మంగళ శాసనోత్సవాన్ని నిర్వహించారు. సాయంసంధ్యవేళ 28అడుగుల పుష్పపల్లకీలో చంద్రప్రభ వాహనంపై అంగరంగ వైభవంగా కొలువైన రామానుజుల స్వామిని రంగనాయకులపేట, ట్రంకురోడ్డు, గాంధీబొమ్మ, వీఆర్‌సీ, ఆర్‌టిసి మీదుగా సరస్వతినగర్‌లోని మాగుంటఇంటి వరకు ఊరేగించారు. ఉదయం ఉభయకర్తగా మాగుంటగోపాలరెడ్డి సాయంత్రం మాగుంట సుధాకర్‌రెడ్డి, ఒంగోలు ఎంపి మాగుంట శ్రీనివాసులురెడ్డి మాగుంట విజయ్‌రెడ్డిలు ఉభయకర్తలుగా వ్యవహరించారు. ఆలయకార్య నిర్వహణాధికారి పాయసం నాగేశ్వరరావు పర్యవేక్షణలో ఈ ఉత్సవం జరిగింది.



PDF Compressor Free Version




## మేషం



అశ్వని, భరణి, కృత్తిక 1 పాదము

ఉద్యోగులకు అధికారుల సహకారం బాగుంటుంది. సాంకేతిక పరిశోధన రంగాల వారికి ఉద్యోగావకాశాలుంటాయి. యజమానులకు వర్కర్లతో సమస్యలుంటాయి. కండరాలు నరాల బాధలుంటాయి. విద్యార్థుల విద్యాభివృద్ధిపై దృష్టిపెట్టండి. సోదర వర్గానికి అభివృద్ధి ఉంటుంది. వృత్తివ్యాపారాలలో పెరుగుదలకు బాగా శ్రమపడతారు. ఆదాయము స్వల్పంగా పెరుగుతుంది.

## వృషభం



కృత్తిక 2, 3, 4 పాదాలు, రోహిణి, మృగశీర్ష1, 2పాదాలు

ముఖ్యమైన విషయాలను మీరే పర్యవేక్షణ చేయడం మంచిది. స్టాక్‌మార్కెట్, రియల్ ఎస్టేట్‌రంగాలు, మార్కెటింగ్ రంగాలు ఆశాభంగం కలిగిస్తాయి. ముఖ్యపత్రాలు, వస్తువుల విషయంలో జాగ్రత్త అవసరం. ఉదర సంబంధ శరీర బాధలుంటాయి. విద్యాప్రగతి బాగుంటుంది. కోర్టు కేసులు వాయిదాపడటం, బాకీలు వసూలు ఆలస్యం కావడం జరుగుతుంది.

## మిథునం



మృగశిర్ష 3,4 పాదాలు, ఆర్ద్ర, పునర్వసు 1, 2, 3పాదాలు

స్థిరాస్తులు, వస్త్ర వానాలు సమకూర్చుకొనే ప్రయత్నాలు జరుగుతాయి. ఆత్మీయులు, బంధువర్గం నుండి శుభవార్తలు వింటారు. జ్వరము శ్వాసకోశ బాధలుండగలవు. ఇతరులకు చేతనైన విధంగా సహాయము చేయగలరు. ప్రభుత్వపరంగా అనుమతులు, బిల్లులు మంజూరుకాగలవు. ఉద్యోగుల పనితీరును సమర్థతను అధికారులు గుర్తిస్తారు.


## కర్కాటకం



పునర్వసు 4 పాదం, పుష్య, ఆశ్లేష

వాహనాలు నడిపేటప్పుడు జాగ్రత్తగా ఉండండి. బంధుముఖ్యుల అనారోగ్య వార్తలువింటారు. ఉద్యోగ ప్రయత్నాలు కొనసాగుతాయి. వ్యవహారాలలో నిర్వాహాటంగా మెలగవలసి ఉంటుంది. ఉద్యోగులు కూడా పైఅధికారవర్గం వల్ల ఇబ్బందులు పడతారు. రావలసిన బాకీలుగాని, ప్రభుత్వపరంగా అనుమతులు, బిల్లులు మంజూరుకాగలవు.


## సింహం



మఖ, పుబ్బ, ఉత్తర 1పాదము

చేపట్టిన పనులు సానుకూలంగా నెరవేరతాయి. స్పెక్యులేషన్ రంగం లాభదాయకంగా ఉంటుంది. ఉద్యోగులు విద్యార్థులకు పనిభారం పడుతుంది. యూనియన్ కార్యక్రమాలలో పాల్గొంటారు. నిర్మాణాలు, కాంట్రాక్ట్ పనులు నిదానంగా జరుగుతాయి. ప్రయోజనం చేకూరే ఖర్చులు పెడతారు. స్వల్ప అనారోగ్య బాధలుంటాయి. ఉద్యోగప్రయత్నాలు నిరాశ కలిగిస్తాయి.

## కన్య



ఉత్తర 2, 3, 4 పాదాలు, హస్త, చిత్త 1, 2 పాదాలు

ఇంట్లో అనారోగ్య బాధలుంటాయి. ఇతరులకై ప్రయాణాలు చేయడం స్థిరాస్తుల లావాదేవీ ప్రయత్నాలు ఉంటాయి. బంధువర్గం మీ పనులకు సహాయపడుతుంది. విద్యపై శ్రద్ధ తగ్గి వ్యాపకం పెరుగుతుంది. నిలబడిపోయిన పనులు కొనసాగుతాయి. వృత్తి వ్యాపారాలలో ఆదాయం పెరగడం, క్రొత్త వ్యాపార అవకాశాలు లభించడం, స్థల మార్పుకు కృషిచేయడం ఉంటుంది.



బ్రహ్మశ్రీ స్వయంపాకుల శ్రీనివాసులు
బాలాజీనగర్, నెల్లూరు

## రాశి - మీ వాసి

తేది. 17.5.2013 నుండి
తేది. 23.5.2013 వరకు

ఈవారం మేషంలో కుజకేతువులు, వృషభంలో రవిబుధగురుశుక్రులు, తులలో శనిరాహువులు, కర్కాటక సింహ కన్య తులారాశులలో చంద్రుడు సంచరిస్తారు.

### పంచాంగము :

తేది 23 గురువారము నృసింహజయంతి.

**ముహూర్తములు :** తేది 23 గురువారము ఉదయం గంట 9 నుండి 11లోగా కర్కాటక లగ్నమున వివాహ వ్యాపార అక్షరాభ్యాస, అన్నప్రాశనలు.

### వైశాఖమాస శుక్లపక్ష తిథులు

| | | | |
|---|---|---|---|
| తేది. 17 | శుక్ర | సప్తమి | సా॥గం.4.51ప॥ |
| తేది. 18 | శని | అష్టమి | సా॥ గం.5.59ప॥ |
| తేది. 19 | ఆది | నవమి | సా॥ గం.5.59ప॥ |
| తేది. 20 | సోమ | దశమి | సా॥ గం.5.43ప॥ |
| తేది. 21 | మంగళ | ఏకాదశి | సా॥ గం. 5.02ప॥ |
| తేది. 22 | బుధ | ద్వాదశి | సా॥గం.3.52ప॥ |
| తేది. 23 | గురు | త్రయోదశి | సా॥గం. 2.20ప॥ |

## తుల



చిత్త 3, 4 పాదాలు, స్వాతి, విశాఖ 1, 2, 3 పాదాలు

కుటుంబసౌఖ్యం, సహకారం మీకు బాగుంటుంది. ఇంటిబయట ఉన్న సమస్యలను సమర్థవంతంగా ఎదుర్కొంటారు. ఉద్యోగులకు పనిభారం, ఇతరులు, అధికారుల వత్తిడి ఎక్కువగా ఉంటుంది. విద్యార్థులకు వ్యాపకాలు పెరిగి చదువుపై శ్రద్ధ తగ్గుతుంది. ఇంటి రిపేర్లు, వస్తు రిపేర్లుంటాయి. శుభకార్య నిర్ణయాలకై ప్రయత్నాలు చేస్తారు. ఆకస్మిక ప్రయాణాలుంటాయి.

## వృశ్చికం



విశాఖ 4 పాదం, అనూరాధ, జ్యేష్ఠ

నిరుద్యోగులకు అవకాశాలు రావడం కష్టం. ఉద్యోగులు విధి నిర్వహణలో ఇబ్బందులనెదుర్కొంటారు. క్రొత్త వారితో పరిచయాలు ఏర్పడగలవు. విద్యార్థులకు చదువుపై మరింత శ్రద్ధ అవసరం. కళాక్రీడా పరిశోధన సాంకేతిక రంగాల వారికి మంచి అవకాశాలు లభిస్తాయి. పరిశ్రమలు నిర్వహించే వారికి, వ్యవసాయదారులకు తృప్తిక రంగా పరిస్థితి ఉండదు. పిల్లల వల్ల ఖర్చులు పెరుగుతాయి.


## ధనుస్సు



మూల, పూర్వాషాఢ, ఉ.షాఢ 1 పాదము

ఉద్యోగులకు పనివత్తిడి వల్ల సమస్యల నెదుర్కొనవలసి వస్తుంది. శుభకార్య ప్రయత్నాలకై తీవ్ర కృషి చేస్తారు. రావలసిన బాకీలు కొంత వరకు అందవచ్చును. విద్యార్థులు ఎక్కువగా చదువుపై కృషిచేస్తారు. వృత్తి వ్యాపార రంగాలు ప్రోత్సాహకరంగా సంతృప్తినిస్తాయి. నిర్మాణరంగాల వారికి, పరిశ్రమ నిర్వాహకులకు ఋణాలు చేయవలసివస్తుంది.

## మకరం



ఉ.షాఢ 2, 3, 4 పాదాలు, శ్రవణ, ధనిష్ఠ 1, 2 పాదాలు

ఒక ముఖ్య విషయంలో విమర్శనలను ఎదుర్కొనవలసి రావచ్చును. కుటుంబసౌఖ్యం బాగుంటుంది. బంధుముఖ్యులందొకరు అనారోగ్యం పాలుకాగలరు. క్రొత్త పరిచయాలను సద్వినియోగం చేసుకొంటారు. స్టాక్ మార్కెట్ నష్టాలు, ప్రయోజనం లేని ప్రయాణాలుంటాయి. ఉద్యోగ ప్రయత్నాలు చిన్న అవకాశాలుండవచ్చు. కాబట్టి సర్దుకొనడం మంచిది.

## కుంభం



ధనిష్ఠ 3, 4 పాదాలు, శతభిష, పూ.భాద్ర 1,2,3 పాదాలు.

ఉద్యోగులు సమర్థతతో అధికారులను మెప్పించగలరు. విద్యార్థులకు మరింతకృషి అవసరం కాబట్టి వ్యాపకాలు తగ్గించుకొనండి. దైవసేవా కార్యక్రమాలలో పాల్గొంటారు. వ్యాపారవృద్ధి అవకాశాలు బాగుంటాయి. ఆర్థికంగా పెరుగుదలకు నిర్మాణాలకు ఋణాలు పొందుతారు. పడే కష్టానికి ప్రతిఫలం బాగుంటుంది. ఉద్యోగార్థులకు సాంకేతికంగా చిన్న అవకాశాలు లభించగలవు.

## మీనం



పూర్వాభాద్ర 4 పాదం, ఉ.భాద్ర, రేవతి

పరిశోధన సాంకేతిక రంగాల వారికి అవకాశాలు దొరుకుతాయి. అధికారులతో సఖ్యత, సహకారం ఉద్యోగులకుంటుంది. హామీలివ్వడం, చేబదుళ్ళు ఇవ్వడం చేయకండి. ఆరోగ్యం బాగానే ఉంటుంది. బంధుమిత్రుల వల్ల మేలు జరుగుతుంది. గృహ, వస్తు వాహన రిపేర్లుంటాయి. స్థానమార్పు, ఇతర ప్రాంతాలకు మారే ప్రయత్నాలు చేస్తారు. శుభకార్య ప్రయత్నాలు జరుగుతాయి.

# దాహార్తి తీరుస్తున్న సమ్మర్ స్టోరేజ్‌ట్యాంక్



గతంలో మే నెల వచ్చిందంటే నెల్లూరంతా మంచినీటి ఎద్దడి నెలకొని వుండేది. బోర్ల వద్ద బిందెల యుద్ధం జరుగుతుండేది. మున్సిపల్ వాటర్ ట్యాంకర్ వచ్చిందంటే మహిళలు బిందెలతో బారులు తీరి నిలుచుని వుండేవాళ్లు. మంచినీటి సమస్యను పరిష్కరించాలంటూ ప్రతిరోజూ మున్సిపల్ కార్యాలయం ఎదుట వామపక్షాల వాళ్లు ఆందోళన చేస్తుండేవాళ్లు. కాని ఎమ్మెల్యే వివేకా ఎంతో ముందుచూపుతో నెల్లూరులో నిర్మించిన సమ్మర్‌స్టోరేజ్ ట్యాంకు విలువ ఏంటో జనానికి ఇప్పుడు తెలిసొస్తుంది. వందకోట్లకు పైగా ఖర్చుతో నిర్మించిన ఈ సమ్మర్‌స్టోరేజీ ట్యాంకు మూలంగా నగరంలో తాగునీటికి కొరత లేకుండా పోయింది. నగరంలో ఎక్కువ భాగం ప్రాంతాలకు ఈ ట్యాంకు ద్వారా నీళ్లందుతున్నాయి. మేనెలలో కూడా గత ఏడాది పెద్దగా వర్షాలు లేకపోయినా నగరంలో మంచినీటికి సమస్య లేకుండా వుందంటే అది సమ్మర్‌స్టోరేజీ ట్యాంకు పుణ్యమే!

# జగన్ క్లీన్ ఇమేజ్‌తో బయటకు వస్తారు

**కాకాణి**

జిల్లాలోని సైదాపురంలో వైయస్సార్‌సీపీ వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త కొమ్మి లక్ష్మయ్యనాయుడు ఏర్పాటు చేసిన బహిరంగసభలో వైయస్సార్‌సీపీ సిఇసి సభ్యుడు కాకాణి గోవర్ధనరెడ్డి పాల్గొని మాట్లాడారు. అధికార, ప్రతిపక్షాలు పార్టీలు ఎన్ని కుయుక్తులు పన్నినా కడిగిన ముత్యంలా జగన్ బయటకు వస్తాడని, ఆయనను ముఖ్యమంత్రిని చేయడమే మనందరి లక్ష్యమని పేర్కొన్నారు. దివంగతనేత వైయస్ రాజశేఖరరెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమపథకాలు ప్రతి ఒక్కరికీ ప్రయోజనం కలిగించాయని, కాని ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం వాటిని నీరుగారుస్తుందన్నారు. ఢిల్లీ పెద్దలు వైయస్ రాజశేఖరరెడ్డి మేలును మరిచి జగన్‌ను జైలులో పెట్టి ప్రజలకు దూరం చెయ్యాలని చూస్తోందన్నారు. ప్రజా సంక్షేమం కోసం రాజీలేని పోరాటం చేసే వ్యక్తి కొమ్మి లక్ష్మయ్యనాయుడని, ఆయన వెంకటగిరి నియోజకవర్గానికి రావడం ప్రజల అదృష్టమన్నారు. కొమ్మిని వెంకటగిరి ప్రజలందరు ఆదరించాలన్నారు. కొమ్మి లక్ష్మయ్యనాయుడు మాట్లాడుతూ దివంగత మహానేత వైయస్ రాజశేఖరరెడ్డి బతికున్నప్పుడు తనను అభిమానించేవారని, మాటతప్పని, మడమతిప్పని జగన్మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో పార్టీ అభివృద్ధికి కష్టపడి పనిచేస్తానన్నారు. ప్రజలకోసం తాను ఎంతటి పోరాటానికైనా సిద్ధమని, కార్యకర్తల మనోభావాలు దెబ్బతినకుండా వుండేందుకు కృషిచేస్తానని తెలిపారు. వైయస్సార్ పాలనలో రైతులు సుభిక్షంగా వున్నారని, ఆ రాజన్న రాజ్యం రావాలంటే జగన్మోహన్‌రెడ్డి సిఎంకావాలని ప్రజలు కోరుకుంటున్నారని తెలిపారు. నెల్లూరురూరల్ నియోజకవర్గ సమన్వయకర్త కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ జగనన్నను సియం చేసేలా మనమంతా కృషిచేద్దామని తెలిపారు. కార్యక్రమంలో వైయస్సార్‌సీని కేంద్ర పాలక మండలి సభ్యులు ఎల్లసిరి గోపాల్‌రెడ్డి, నాయకులు అనిల్ కుమార్‌యాదవ్, వరకుమార్, రూప్‌కుమార్‌యాదవ్, తాతారెడ్డి వీరారెడ్డిలు ప్రసంగించారు. పార్టీ మండల కన్వీనర్ కృష్ణారెడ్డి అధ్యక్షత వహించగా పట్టాభిరామిరెడ్డి, శంకరరాజు, రామచంద్రారెడ్డి, భాస్కర్, రవీంద్రరెడ్డి, వీరారెడ్డి, ప్రభాకరరెడ్డి పాల్గొన్నారు.




# పెళ్లి సంబంధాలు

## వధువు కావలెను

1. 1983 జూన్ 19 జననం. ఎత్తు 5'8". చదువు బి.ఇ(కంప్యూటర్స్) ఐటి ప్రొఫెషనల్ కంపెనీ, ఐబియం ఇండియాప్రైవేలిమిటెడ్. బెంగుళూరు. జీతం నెలకు 1,40,000/-. ఉన్నతమైనరెడ్డి ఉద్యోగకుటుంబం. ఆస్తివాటా 7కోట్లు. స్వస్థలం నెల్లూరుజిల్లా, ప్రస్తుతనివాసం తిరుపతి.
2. 1980 ఆగష్టు 22 జననం. ఎత్తు 5'8". చదువు యం.బి.బి.యస్. పిజి 3సం॥. కంటి డాక్టరు. ఆస్తి వాటా 10కోట్లు. ఉన్నతమైనరెడ్డి వ్యాపారకుటుంబం. స్వస్థలం చిత్తూరుజిల్లా.
3. 1981 జూన్ 10 జననం. ఎత్తు 5'71/2". చదువు యం.బి.బి.యస్(దవన్‌గిరి), కర్ణాటక. ప్రస్తుతం 3సం॥ ఇంటర్నల్ మెడిసిన్ రెసిడెన్స్-న్యూజెర్సీ, ఆస్తివాటా 3కోట్లు. ఉన్నతమైనరెడ్డి వ్యాపారకుటుంబం. స్వస్థలం కర్నూలుజిల్లా. ప్రస్తుత నివాసం హైదరాబాద్.
4. 1988 ఏప్రిల్ 11 జననం. ఎత్తు 5'8". చదువు బి.టెక్(ఆర్.యం.కె, చెన్నై). ఉద్యోగం టి.సి.యస్, చెన్నై, జీతం నెలకు 40,000/-. ఆస్తివిలువ 5కోట్లు. ఉన్నతమైనరెడ్డి వ్యవసాయకుటుంబం. స్వస్థలం నెల్లూరుజిల్లా.
5. 1983 ఏప్రిల్ 17 జననం. ఎత్తు 5'9". చదువు బి.ఇ(ఇఇఇ), ఆర్.యం.కె, చెన్నై, ఉద్యోగం సీనియర్ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్. టాటామోటార్స్, టాటా టెక్నాలజీస్, పూనా. జీతం నెలకు 60,000/-. ఆస్తివిలువ 7కోట్లు. స్వస్థలం ప్రకాశంజిల్లా. ఉన్నతమైనరెడ్డి వ్యాపారకుటుంబం. ప్రస్తుతనివాసం విశాఖపట్నం.



## వరుడు కావలెను

6. 1986 మార్చి 22 జననం. ఎత్తు 5'7". చదువు బి.టెక్(కంప్యూటర్స్), హైదరాబాద్. యం.బి.ఏశాప్(రైన్ యం.బి.ఏ కాలేజ్, ముంబై). ఉద్యోగం జి.ఇ(హైదరాబాద్). జీతం నెలకు 1లక్ష, ఆస్తి వాటా 5కోట్లు. ఉన్నతమైనరెడ్డి ఉద్యోగకుటుంబం. స్వస్థలం నల్గొండజిల్లా. ప్రస్తుతనివాసం హైదరాబాద్.
7. 1990 జూలై 4 జననం. ఎత్తు 5'31/2". చదువు బి.టెక్(ఇఇఇ) హైదరాబాద్. ఉన్నతమైనరెడ్డి వ్యాపారకుటుంబం. ఆస్తివాటా 15కోట్లు. స్వస్థలం నెల్లూరుజిల్లా. ప్రస్తుతనివాసం హైదరాబాద్.
8. 1989 ఏప్రిల్ 6 జననం. ఎత్తు 5'6". చదువు బి.టెక్(ఐ.టి). హైదరాబాద్, (యం.యస్), (ఆస్ట్రేలియా). ఉద్యోగం టి.సి.యస్ ఉన్నతమైనరెడ్డి వ్యాపారకుటుంబం. ఆస్తివాటా 3కోట్లు స్వస్థలం చిత్తూరుజిల్లా.
9. 1990 అక్టోబరు 18 జననం. ఎత్తు 5'5". చదువు బి.ఇ(ఆర్.యం.కె, చెన్నై). ఉన్నతమైనరెడ్డి వ్యాపారకుటుంబం. ఆస్తివిలువ 50కోట్లు. స్వస్థలం చిత్తూరుజిల్లా. ప్రస్తుతనివాసం నెల్లూరుజిల్లా.
10. 1990 అక్టోబరు 10 జననం. ఎత్తు 5'51/2". చదువు బి.టెక్(కంప్యూటర్స్) హైదరాబాద్. ఉన్నతమైనరెడ్డి వ్యాపారకుటుంబం. ఆస్తివిలువ 10కోట్లు. స్వస్థలం కడపజిల్లా. ప్రస్తుతనివాసం హైదరాబాద్.

వివరాలకు: కొండూరు హరినారాయణరెడ్డి, 25-9-413, పోస్టల్‌కాలనీ, ఆంధ్రకేసరినగర్, నెల్లూరు - 4.

98480 34522
94406 39460.

పోస్ట్‌బాక్స్ నెం.4. C/o. లాయర్ జాతీయ తెలుగు వారపత్రిక, ప్లాట్ నెం. 1 & 2. మెయిన్‌రోడ్డు, మాగుంట లే-అవుట్, నెల్లూరు - 3.

PDF Compressor Free Version



# కల్యాణ వైభవం...!



తెలుగుదేశం పొలిట్‌బ్యూరో సభ్యులు, మాజీమంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి - జ్యోతిల కుమారుడు రాజగోపాలరెడ్డి - శృతి (అనంతపురం వాస్తవ్యులు కేతిరెడ్డి నాగిరెడ్డి-జయంతిల కుమార్తెల) కల్యాణం ఈ నెల 12వ తేదీ హైదరాబాద్‌లోని ఎస్.ఎస్.కన్వెన్షన్‌లో అత్యంత వైభవంగా జరిగింది. మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఈ వేడుకకు హాజరై నూతన దంపతులను ఆశీర్వదించారు. కొత్తజంటకు 'లాయర్' శుభాభినందనలు.



ఇందుకూరుపేట మండలం కుడితిపాళెం వాస్తవ్యులు బెజవాడ సుధాకర్‌రెడ్డి - శైలజల కుమారుడు సుమన్‌రెడ్డి - అలేఖ్యల వివాహం ఈనెల 12వతేదీ పడుగుపాడులోని పుచ్చలపల్లి సుందరయ్య కల్యాణ మండపంలో జరిగింది. వధూవరులకు 'లాయర్' శుభాకాంక్షలు.

# అన్నం పెట్టిన చేతినే నరుకుతారు

## ఆనంపై కోవూరు ఎమ్మెల్యే ప్రసన్న నిప్పులు



బుచ్చిరెడ్డిపాళెం మండలం కాగులపాడులో ఈనెల 15న కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వైయస్సార్ సంతాపసభ రోజు జగన్మోహన్‌రెడ్డిని సిఎం చేయకపోతే రాష్ట్రం అగ్నిగుండ మవుతోందన్న ఆనం సోదరులు ఇప్పుడు పదవీలాలసతో ఊసరవెల్లులుగా మారారన్నారు. దివంగత నేత డాక్టర్ వైయస్‌రాజశేఖరరెడ్డి ఫోటోతో ఎమ్మెల్యేలుగా గెలిచి మంత్రి పదవి పొందిన వారు ఇప్పుడు ఆయన కుటుంబాన్నే విమర్శించడం అన్నంపెట్టిన చేతినే నరికినట్టుగా వుందన్నారు. సోనియాగాంధీ మెప్పుకోసం వైయస్సార్ కుటుంబాన్ని అవమానిస్తే ప్రజాగ్రహంలో కొట్టుకుపోవడం ఖాయమన్నారు. రాజకీయాల్లోకి వచ్చినప్పట్నుంచి ఇప్పటి వరకు వారు ఎంత సంపాదించారు, ఎలా సంపాదించారనే విషయంపై సిబిఐ విచారణ జరపాలని డిమాండ్‌చేసారు. బెంగుళూరు, రాజమండ్రిలలో వున్న ఆస్తులను ఎక్కడ్నించి వచ్చాయో విచారణ చేయాలన్నారు. కార్యక్రమంలో వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీ నెల్లూరు నగర సమన్వయకర్త అనిల్‌కుమార్‌యాదవ్, మండలాల కన్వీనర్లు టంగుటూరు మల్లికార్జునరెడ్డి, ములుమూడి వినోద్‌రెడ్డి మావులూరు శ్రీనివాసులురెడ్డి, వవ్వేరు బ్యాంకు ఛైర్మెన్ సూరా శ్రీనివాసులురెడ్డి నాయకులు కలువ బాలశంకర్‌రెడ్డి, ఇప్పగుంట విజయభాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

- రవి చిన్నపిల్లల ఆసుపత్రిలో అరుదైన సంఘటన

# బరువుతక్కువ బిడ్డలకు రక్షణ!



ప్రకృతి సిద్ధంగా తల్లికి ఒక కాన్పులో ఒక బిడ్డ జన్మించడం సాధారణమని, అలా కాకుండా ఇద్దరు, లేదా ముగ్గురు పిల్లలు ఒకే కాన్పులో జన్మించడం చాలా అరుదైన విషయమని, వెయ్యి కాన్పులు జరిగితే ఏ ఒక్కరికో ఇద్దరికో ఇలా ముగ్గురు శిశువులు ఒకే కాన్పులో జన్మించడం జరుగుతుందని రిచ్‌హాస్పిటల్ ప్రముఖ చిన్న పిల్లల వైద్యనిపుణులు డా॥టి.రవికుమార్ పేర్కొన్నారు. మంగళవారం హాస్పిటల్ ఛాంబర్‌లో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో రవికుమార్ మాట్లాడుతూ గతనెల 26వతేదీన నెల్లూరు జిల్లా, టిపిగూడూరు మండలం వెంకన్నపాళెం గ్రామానికి చెందిన పేట శ్రీనివాసులు, మాధవి దంపతులకు ఒకే కాన్పులో ముగ్గురు పిల్లలు జన్మించారని, అది కూడా 7వ నెలలో జన్మించినందున తక్కువ బరువుతో ఒక బిడ్డ 900గ్రాములు, రెండవ బిడ్డ 950గ్రాములు, మూడవ బిడ్డ వెయ్యి గ్రాముల అతితక్కువ బరువుతో మెదడు, గుండె, ఊపిరితిత్తుల్లాంటి ప్రధాన అవయవాలు ఎదుగుదల లేకుండా ఆయాసం వంటి ప్రాణాపాయ స్థితిలో జన్మించినట్లు తెలిపారు. శ్రీనివాసులు దంపతులు బిడ్డలను ప్రాణాపాయస్థితిలో రిచ్ హాస్పిటల్‌లో చేర్పించారని, నిరుపేదలైన ఈ దంపతులకు గర్భశోకం కలగకుండా రాజీవ్‌ఆరోగ్యశ్రీ పథకం ద్వారా ఉచితంగా అత్యాధునిక వైద్య విధానాల ద్వారా కృత్రిమశ్వాసను అందిస్తూ 24గంటలూ చిన్నపిల్లల వైద్యనిపుణుల పర్యవేక్షణలో 3వారాలు వుంచి ముగ్గురు శిశువులను బ్రతికించడం జరిగిందన్నారు. వసంతలక్ష్మి ఛారిటబుల్ ట్రస్ట్ ఛైర్‌పర్సన్ టి.వసంతలక్ష్మి మాట్లాడుతూ అమెరికా లాంటి దేశాలలోనే ఇటువంటి బిడ్డలను బ్రతికించడం చాలా అరుదుగా జరుగుతుందని, అలాంటి అరుదైన వైద్యాన్ని రిచ్‌హాస్పిటల్ వారు అందించి ముగ్గురు బిడ్డలను బ్రతికించడం సింహపురి వైద్య చరిత్రకే గర్వకారణమన్నారు.

### లేగుంటపాడులో...

# వైభవంగా శ్రీనివాస కల్యాణం



తిరుమల తిరుపతి దేవస్థానం ధార్మిక సలహా మండలి సౌజన్యంతో ఇటీవల కోవూరు మండలం లేగుంటపాడులోని జిల్లా ప్రజాపరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో శ్రీనివాస కల్యాణం అంగరంగ వైభవంగా జరిగింది. ఈ కల్యాణం తిలకించడానికి కోవూరు మండలంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు విరివిగా తరలి వచ్చారు. వేదపండితులు శాస్త్రోక్తంగా తిరుమలలో జరిపే కల్యాణోత్సవాన్ని ఇక్కడ సాక్షాత్కరింపచేయడంతో భక్తులు ఆనంద పారవశ్యులయ్యారు. కార్యక్రమానికి నిడుముసలి వెంకటరమణారెడ్డి, అన్నపూర్ణమ్మ దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. నెల్లూరు నగర ఎమ్మెల్యే ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి, కావలి ఎమ్మెల్యే బీదా మస్తాన్‌రావు, కోవూరు మాజీ ఎమ్మెల్యే పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, పడుగుపాడు సొసైటీ అధ్యక్షులు జెట్టి రాజగోపాల్‌రెడ్డి, జిల్లా తెలుగుదేశంపార్టీ అధ్యక్షులు బీద రవిచంద్ర, నిడిముసలి సురేష్‌కుమార్‌రెడ్డి, నిడిముసలి మల్లిఖార్జునరెడ్డి, జనార్ధన్‌రాజు, టిటిడి ధార్మికసలహామండలి సభ్యులు వాకాటి విజయకుమార్‌రెడ్డి, వీరిశెట్టి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

# వాసవి- వనిత మాతృదినోత్సవం



ఈ నెల 12వ తేదీన అంతర్జాతీయ మాతృదినోత్సవాన్ని వాసవి క్లబ్-నెల్లూరు, వనితక్లబ్-నెల్లూరు వారు నెల్లూరు పప్పులవీధిలోని కేపిసి అవెన్యూలో ఘనంగా నిర్వహించారు. 'సమాజంలో తల్లిపాత్ర మరియు ఈ కాలంలో పిల్లల పెంపకం- తీసుకోవాల్సిన జాగ్రత్తలు', 'తల్లి యొక్క ప్రాముఖ్యత' వంటి అంశాలపై వక్తృత్వపోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులందజేశారు. అలాగే చిన్నారులను తల్లిదండ్రులు అక్షింతలతో ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో వనిత క్లబ్ అధ్యక్షురాలు సి. హెచ్. ఉమారాణి, కోశాధికారి రాజరాజేశ్వరి, వాసవి క్లబ్ అధ్యక్షులు చలువాది వెంకట శరత్‌కుమార్, ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు, క్లబ్ డిప్యూటీ గవర్నర్ వి.ఇ.మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# దేవస్థానం ఇఓల బదిలీలు

నెల్లూరు జిల్లాలోని పలుదేవస్థానాల ఇఓలను బదిలీ చేస్తూ బుధవారం దేవాదాయశాఖ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. నెల్లూరు దర్గామిట్టలోని శ్రీరాజరాజేశ్వరి అమ్మవారి దేవస్థానం సహాయ కమీషనర్ వెండిదండి శ్రీనివాసరెడ్డిని గుంటూరుజిల్లా పొన్నూరు భావనారాయణస్వామి ఆలయ ఏసీగా నియమించారు. ఆయన స్థానంలో శ్రీ తల్పగిరి రంగనాథస్వామి దేవస్థానం ఇఓ పాయసం నాగేశ్వరరావును నియమిస్తూ ఉత్తర్వులు జారీ [illegible]రు. జొన్నవాడ శ్రీ కామాక్షిమల్లికార్జునస్వామి దేవస్థాన సహాయకమీషనర్‌గా అనంతపురం జిల్లా కదిరి నరసింహస్వామి దేవస్థానం ఇఓ శివకుమార్‌ను నియమించారు. ఇక్కడి ఏసి వేగూరు రవీంద్రరెడ్డి జిల్లా సహాయ కమీషనర్‌గా పూర్తిస్థాయి బాధ్యతలు నిర్వహిస్తారు. కొండబిట్రగుంట దేవస్థానం ఇఓ ప్రభాకర్ [illegible] గముడి ఆంజనేయస్వామి దేవస్థానంకు బదిలీచేయగా అమరావతి నుంచి వెంకటేశ్వర్లు కొండ [illegible]ంటకు రానున్నారు.

# విద్యుత్ శాఖలో స్థానచలనం

విద్యుత్‌శాఖలో భారీగా బదిలీలు జరిగాయి. వివిధ కేటగిరీల వారీగా 130మంది ఉద్యోగులను బదిలీ చేసారు. జిల్లాలో ఆయా స్టేషన్లలో మూడేళ్ళు, ఆయా ప్రాంతాల్లో అయిదేళ్ళు సర్వీసు పూర్తిచేసుకున్న ఉద్యోగులను బదిలీచేసారు. నిబంధన ప్రకారం బదిలీ అయ్యే ఉద్యోగులు 20శాతం మించరాదు. ఈ విషయాన్ని పరిగణలోకి తీసుకొన్న ఆ శాఖ ఎస్ఈ నందకుమార్ ఉద్యోగుల ఆప్షన్ ప్రకారం కౌన్సిలింగ్ నిర్వహించారు. బదిలీలకు బుధవారం ఆఖరి రోజుకావడంతో వివరాలను ప్రకటించారు. బదిలీలు అయిన వారిలో 6మంది ఏడీఇలు 27మంది ఏఇలు 17 మంది సబ్‌ఇంజనీర్లు ఉన్నారు. వివిధ కార్యాలయాల్లో పనిచేస్తున్న ముగ్గురు జూనియర్‌అకౌంట్సు ఆఫీసర్లు, 27మంది సీనియర్ అసిస్టెంట్లు, 26మంది జూనియర్ అసిస్టెంట్లు, ఇద్దరు టైపిస్టులు, నలుగురు రికార్డు అసిస్టెంట్లు 9మంది కిందిస్థాయి సిబ్బంది, ఇద్దరు ఫోర్‌మెన్‌లు, నలుగురు సీనియర్ లైన్‌ఇన్స్‌పెక్టర్‌లు ఉన్నారు. వీరందరూ ఈనెల 22లోగా బాధ్యతలు సేకరించాల్సి ఉంది.

PDF Compressor Free Version



మల్టీస్టారర్ సినిమాలకు తానెప్పుడూ రెడీ అనే విక్టరీ వెంకటేష్ మరోసారి నిజం చేస్తున్నాడు. యంగ్ హీరో రామ్‌తో కలిసి వెంకటేష్ ఓ సినిమా చేయబోతున్నాడు. ఈ సినిమాకి 'గరం మసాల' అనే పేరును ఖరారు చేసినట్లు తెలుస్తుంది. బాలీవుడ్ సినిమా 'బోల్‌బచ్చన్'కు ఇది రీమేక్. సీతమ్మ అంజలి, షాజన్ పాదంసీలు హీరోయిన్లుగా నటిస్తున్నారు.

## వెంకి-రామ్‌ల గరంమసాలా



## త్రిభాషా చిత్రంగా 'పవిత్ర'

శ్రియ వైవిధ్యభరితమైన పాత్రలో నటించిన 'పవిత్ర' సినిమా ఆడియో మంచి హిట్ సాధించడంతో అందుకు గుర్తుగా మే19న ప్లాటినండిస్క్ ఫంక్షన్ నిర్వహిస్తున్నారు. ఈ సినిమా త్వరలో తెలుగు, తమిళ, మళయాళ భాషల్లో విడుదల కానుంది.



## మూ'వీ'క్షణం



### జూన్‌లో మూడుతరాలు

అక్కినేని అభిమానులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న మూడు తరాల నటుల సినిమా జూన్ మొదటి వారం నుండి మొదలుకానుంది.

ఈ నెల 20న కేన్ ఫిలింఫెస్టివల్‌లో 'ఈగ' ఎగరనుంది. ఈగ సినిమాను అక్కడ ప్రదర్శించనున్నారు. ఈ కార్యక్రమానికి ఈగ టీంలో కొంతమంది వెళ్ళనున్నారు.



కేన్స్‌లో ఎగరనున్న ఈగ

## అక్కడ బాగా క్లిక్కయ్యింది

టాలీవుడ్ నుండి బాలీవుడ్‌కు వెళ్ళి అక్కడ మంచి హిట్ కొట్టడం, అదే సమయంలో టాలీవుడ్‌లో హిట్‌లు లేకపోవడంతో ఇలియానా బాలీవుడ్‌లో సెటిలైపోవాలని చూస్తోంది. తాజాగా ఈమె సైఫ్‌అలీఖాన్‌తో జోడీ కట్టబోతుంది.





## 'కాంచన'లో 3... ముని-3లో..?

ముని-2గా వచ్చిన 'కాంచన' సినిమాలో 3విభిన్న పాత్రల్లో నటించి ప్రేక్షకులను భయపెట్టిన లారెన్స్ 'కాంచన'కు సీక్వెల్‌గా వస్తున్న 'ముని-3'లో ఆరు గెటప్పుల్లో కనిపించి దడ పుట్టించబోతున్నాడు. ఈ సినిమా ద్వారా లారెన్స్ సోదరుడు వినో పరిచయం కాబోతున్నాడు. 'రెబల్'తో ఖంగుతిన్న లారెన్స్ 'ముని-3'తో ఆ లోటును భర్తీ చేసుకోవాలనుకుంటున్నాడు.

# గూడూరు డివిజన్ వార్తలు

## దేశంలో మహిళలకు రక్షణ కరువైంది

### వైయస్సార్‌సీపీ నాయకుడు బత్తిన విజయకుమార్



మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న బత్తిన విజయకుమార్

యూపీఏ పాలనలో దేశంలో మహిళలకు రక్షణ కరువైందని వైయస్సార్‌సీపీ నాయకుడు బత్తిన విజయకుమార్ అన్నారు. అంతర్జాతీయ మాతృదినోత్సవాన్ని పురస్కరించుకొని చిల్లకూరు మండలంలోని కృష్ణాపురం గిరిజన కాలనీలోని మహిళలకు ఈ నెల 12వ తేదీ చీరలు పంపిణీ చేసారు. ఈ సందర్భంగా బత్తిన విజయకుమార్ మాట్లాడుతూ దేశ రాజధానిలోనే మహిళలపై లైంగిక దాడులు జరుగుతున్నాయని, కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోవడంలేదని అన్నారు. మహిళలకు రక్షణ కల్పించే దిశగా రానున్న కాలంలో వైయస్ జగన్మోహన్‌రెడ్డి గట్టి చర్యలు తీసుకుంటారని పార్టీ గౌరవాధ్యక్షులు విజయమ్మ చెప్పారన్నారు. అనంతరం గిరిజనకాలనీలో 150మంది మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైయస్సార్‌సీపీ నాయకులు చెంచు కృష్ణయ్య, మన్నెం శ్రీనివాసులు, సీతారామిరెడ్డి, రమణారెడ్డి, అఫ్సర్, హబీబుల్లా, రహంతుల్లా, అహ్మద్, సొంగా చంద్రమోహన్, అబ్బాస్, సుభాన్ తదితరులు పాల్గొన్నారు.

## లయన్స్‌క్లబ్ అధ్వర్యంలో... వృద్ధులకు దుస్తుల పంపిణీ



వృద్ధులకు దుస్తులు పంపిణీ చేస్తున్న వైజేపీ లయన్స్ క్లబ్ సభ్యులు


గూడూరు వైజేపీ లయన్స్‌క్లబ్ అధ్వర్యంలో అంతర్జాతీయ మాతృదినోత్సవాన్ని పురస్కరించుకుని వృద్ధులకు ఈ నెల 12వ తేదీ మనోవికాస కేంద్రంలో నిర్వహిస్తున్న వృద్ధాశ్రమంలో దుస్తులు పంపిణీ చేసారు. వైజేపీ లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు వై.గురునాథం మాట్లాడుతూ నవమాసాలు మోసి కనిపెంచిన తల్లిదండ్రులను వృద్ధాశ్రమంలో విస్మరించడం తగదన్నారు. ప్రతిఒక్కరూ తల్లిదండ్రులను ఆదరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో క్లబ్ సభ్యులు సత్యానందస్వామి, వెంకట సుబ్బయ్య, నారాయణరాజు, మంజులాదేవి, ఆర్.వి.రావు, సుధాకర్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

## అర్జీలపై దృష్టి సారించండి

### -: తహశీల్దార్ మైత్రేయ :-

ప్రతి సోమవారం గ్రీవెన్స్‌డేలో వచ్చే అర్జీలపై ప్రత్యేకదృష్టి సారించి సత్వరం పరిష్కరించాలని తహశీల్దార్ మైత్రేయ వీఆర్వోలకు సూచించారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో సోమవారం జరిగిన గ్రీవెన్స్‌డేకు రూరల్ పరిధిలోని పలు గ్రామాల నుంచి అర్జీదారులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. గాంధీనగర్, నెర్నూరు, గొల్లపల్లి, కాండ్ర, విందూరు, వెందోడు, కుందకూరు, పురిటిపాళెం, పోటుపాళెం, విందూరు ప్రాంతాల నుంచి సమస్యల పరిష్కారం కోసం పెద్దసంఖ్యలో అర్జీలు వచ్చాయి. తహశీల్దార్ మైత్రేయ అన్ని శాఖల అధికారులతో సమావేశం ఏర్పాటు చేసి గ్రీవెన్స్‌డేలో వచ్చే అర్జీలను వీఆర్వోలు పూర్తి స్థాయిలో పరిశీలించి సంబంధిత అధికారుల ద్వారా సమస్యలను పరిష్కరించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ నిర్మలాదేవి, ఆర్ఐ శ్రీనివాసరావు, వ్యవసాయ గృహనిర్మాణ శాఖాధికారులు, వీఆర్వోలు తదితరులు పాల్గొన్నారు.

## కనుపూరు ముత్యాలమ్మకు పంచామృతాభిషేకం



చిల్లకూరు మండలంలోని తూర్పు కనుపూరులో కొలువైన ముత్యాలమ్మకు 12వ తేదీ పంచామృతాభిషేకం నిర్వహించారు. ఆలయంలో ప్రత్యేకపూజలు, అభిషేకాలు నిర్వహించినట్లు ఆలయ కార్యనిర్వాహణ అధికారి అవుల వెంకటేశ్వర్లు తెలిపారు. అమ్మవారు ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారన్నారు. భక్తులు అమ్మవారికి పొంగళ్లు పెట్టి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ ఈఓ. అవుల వెంకటేశ్వర్లు భక్తుల ఏర్పాట్లను పర్యవేక్షించారు.

## గుర్తుతెలియని వ్యక్తులకు అద్దెఇళ్లు ఇవ్వొద్దు



మహిళలకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

గూడూరు పట్టణంలోని మురికివాడల్లో అసాంఘిక కార్యకలాపాలతో పాటు గంజాయి విక్రయాలు ఎక్కువగా జరుగుతున్నట్లు ఫిర్యాదులు అందుతున్నాయని, దీనిని దృష్టిలో ఉంచుకుని గుర్తు తెలియని వ్యక్తులకు అద్దెఇళ్లు ఇవ్వొద్దని పోలీసులు గూడూరు వాసులకు సూచించారు. పట్టణంలోని అరుంధతీయవాడలో 12వ తేదీ పోలీసులు మహిళలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా 1వ, 2వ పట్టణ ఎస్సైలు షరీఫ్, అంకమరావు మాట్లాడుతూ ఇటీవల గాంధీనగర్ ప్రాంతంలో కొత్త వ్యక్తులు అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారని ఫిర్యాదులు అంద[illegible] డీఎస్పీ చౌడేశ్వరీ ఆధ్వర్యంలో ఆ ప్రాంతంలో పర్యటించి వివరాలను సేకరి[illegible]రిగిందన్నారు. నెల్లూరు ఎస్పీ రమణకుమార్ ఆదేశాల మేరకు డీఎస్పీ ఆధ్వ[illegible]లో పట్టణంలోని మురికివాడల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఏ వ్యక్తిపైన అనుమానం వచ్చినా వెంటనే 100కి ఫోన్‌చేసి సమాచారం అందించాలని సూచించారు.

## సంస్కృతి సమ్మేళనం ఆధ్వర్యంలో నాటకపోటీలు




నాటక పోటీల కరపత్రాలను ఆవిష్కరిస్తున్న సంస్కృతి సమ్మేళనం సభ్యులు

గూడూరు సంస్కృతి సమ్మేళనం అధ్వర్యంలో డీఎన్నార్ కమ్యూనిటీ హాలులో ఈ నెల 16నుంచి 19వ తేదీ వరకు రాష్ట్ర స్థాయి నాటకపోటీలు నిర్వహిస్తున్నట్లు సంస్కృతి సమ్మేళనం అధ్యక్షుడు సిద్ధారెడ్డి జనార్ధన్‌రెడ్డి తెలిపారు. 12వ తేదీ ఆయన నివాసంలో సంస్కృతి సమ్మేళనం సభ్యులతో కలసి నాటకపోటీల కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంస్కృతి సమ్మేళనం 60వ వార్షికోత్సవం సందర్భంగా ఆంధ్రప్రదేశ్ సాంస్కృతిక శాఖ సహకారంతో నిర్వహించే నాటక పోటీలకు రాష్ట్రంలో వివిధ జిల్లాల నుంచి కళాకారులు హాజరై నాటకాలను ప్రదర్శిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ సమావేశంలో కార్యదర్శి కె.మునిగిరీష్, చలపతిరావు, సోమిశెట్టి చెంచురామయ్య, నాటక విభాగ వ్యవహారకర్త జానా శివయ్య, కోశాధికారి జి.జి.నాయుడు, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

PDF Compressor Free Version



# కల్యాణ వైభవం...!



## నిఖిల్ - జీవని

'లాయర్' వారపత్రిక వ్యవస్థాపకులు స్వర్గీయ తుంగా రాజగోపాలరెడ్డి - శ్రీదేవమ్మల మనుమడు (కుమార్తె నిరూప-శ్రీహరిరెడ్డిల కుమారుడు), పంచాయితీ శాఖలో విస్తరణాధికారిగా రిటైరైన కీ॥శే॥ సూళ్ళూరు బలరామిరెడ్డి - బుజ్జమ్మల మనుమడు చిరంజీవి **నిఖిల్ - జీవని** (ముంబయ్ తుమ్మల గంగాధరరెడ్డి - విజయలక్ష్మిల కుమార్తె)ల కల్యాణ వేడుక మే 12వ తేదీ ఆదివారం కడపలోని బిర్లా గార్డెన్స్‌లో గల శ్రీరాజరాజేశ్వరి కల్యాణ మండపంలో ఘనంగా జరిగింది. అలాగే 15వ తేదీ సాయంత్రం రిసెప్షన్ వేడుకలు నెల్లూరు మాగుంట లేఅవుట్‌లో గల సిపిఆర్ కల్యాణ మండపంలో వైభవంగా జరిగాయి. నగర ప్రముఖులు, బంధుమిత్రులు పెద్దసంఖ్యలో హాజరై వధూవరులను ఆశీర్వదించారు. నూతన దంపతులకు 'లాయర్' శుభాభినందనలు.

# కలెక్టర్‌తో వాకాటి వార్



- ఎంపిడిఓల బదిలీల వ్యవహారంలో ముదిరిన వివాదం
- మంత్రి సమక్షంలోనే పరస్పర వాదోపవాదాలు



ఎంపీడీవోల బదిలీల వ్యవహారం ఎమ్మెల్సీ వాకాటి నారాయణరెడ్డి, జిల్లా కలెక్టర్ బి.శ్రీధర్ మధ్య వివాదానికి దారితీసింది. కౌన్సిలింగ్ నిబంధనలకు విరుద్ధంగా ఇద్దరు ఎంపీడీవోలను పరస్పర బదిలీలకు అనుమతించేందుకు కలెక్టర్ నిరాకరించడంతో ఈ వివాదం తలెత్తింది. కావలి సమీపంలోని మద్దూరుపాడులో బుధవారం జరిగిన రైతుసదస్సు ముగిసిన తర్వాత వేదిక దిగే సమయంలో ఈ వివాదం చోటుచేసుకుంది. వివరాలిలా వున్నాయి. ఈనెల 13వతేదీన ఎంపీడీవోల బదిలీల కౌన్సిలింగ్ జరిగింది. ఈ కౌన్సిలింగ్‌లో సూళ్ళూరుపేట, తడ ఎంపీడీవోలు ఎం.బ్రహ్మయ్య, శివయ్య, పరస్పర బదిలీలకు దరఖాస్తు చేసుకున్నారు. పరస్పర బదిలీలు అనేది కౌన్సిలింగ్ నిబంధనాలకు విరుద్ధం. దీంతో వారి బదిలీలను జిల్లా పరిషత్ అధికారులు ఎబియన్స్‌లో ఉంచారు. తదుపరి చర్యల కోసం సంబంధిత ఫైలును జిల్లా కలెక్టర్‌కు పంపారు. ఈ ఫైలుపై కలెక్టర్ రెండు రోజులుగా నిర్ణయంతీసుకోలేదు. ఈ పరిస్థితుల్లో బుధవారం కావలిలో జరిగిన రైతుసదస్సులో ఎంపీడీవోల బదిలీల ఫైలు విషయాన్ని కలెక్టర్‌తో వాకాటి ప్రస్తావించారు. నిబంధనలకు విరుద్ధంగా ఉన్నందున దానిని ఆమోదించలేదని కలెక్టర్ స్పష్టంచేసారు. సదస్సు ముగిసినప్పటికీ కలెక్టర్ నుంచి సమాధానం రాకపోవడంతో వాకాటికి ఆగ్రహం కలిగి సదస్సు ముగించుకుని వేదిక దిగే సమయంలో మరోసారి ఎంపిడీవోల ఫైల్ విషయమై కలెక్టర్‌ను ప్రశ్నించడంతో ఈ వివాదం చోటుచేసుకుంది. ఎంపిడీవోల బదిలీల వ్యవహారంలో పట్టుదలకు పోయిన వాకాటి చివరకు రాజీనామా చేస్తాననే వరకు వెళ్ళడంతో జిల్లా అధికారుల్లోనూ, అధికార పార్టీ నాయకుల్లోనూ ఈ విషయం చర్చనీయాంశమైంది.

# అయ్యవార్లకు అగచాట్లు!

మాతృదేవోభవ, పితృదేవోభవ, ఆచార్యదేవోభవ అని అన్నారు. అంటే తల్లిదండ్రుల తర్వాత స్థానం గురువుదే! ఈ సమాజంలో ఎవరు ఎంతటి ఉన్నతస్థానాల్లోనైనా వుండొచ్చు. కాని వాళ్లంతా కూడా గురువుల వద్ద శిక్షణ పొందినవాళ్లే! భారత రాష్ట్రపతి, అమెరికా ప్రెసిడెంట్, ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యదర్శి... ఎవరైనా, ఎంతటి స్థానంలో వున్నా ఒకప్పుడు తమ గురువుకు శిష్యులే!

ఉపాధ్యాయులది ఎంతో గౌరవనీయమైన పాత్ర. అలాంటి ఉపాధ్యాయులు ఎర్రటి ఎండలో మండుతూ, తమ నెంబర్ ఎప్పుడెప్పుడు వస్తుందా అని ఎదురుచూస్తూ ఉక్కపోతకు విసుకుంటుంటే చూసే వాళ్లకు చాలా జాలేసింది. ఇటీవల నెల్లూరు దర్గామిట్టలోని కస్తూర్బా కళాక్షేత్రంలో ఉపాధ్యాయుల బదిలీలకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ప్రతిరోజూ వందలసంఖ్యలో ఉపాధ్యాయులు కౌన్సిలింగ్ సెంటర్ వద్దకు వచ్చారు. తమ నెంబర్ ఎప్పుడొస్తుందో తెలియక ఉపాధ్యాయులు అక్కడే చెట్ల క్రింద నిలబడి గంటల తరబడి కాపుకాసారు. ముఖ్యంగా ఆరోగ్యం సరిగా లేని వారు, మహిళలు ఇలా వేచిచూడాల్సి వచ్చింది. ఉపాధ్యాయుల బదిలీలను ఇలా కాకుండా గౌరవప్రదంగా వుండేలా నిర్వహిస్తే బాగుంటుందేమో!



- సర్వేపల్లి సమరం

# నిన్న దోస్తీ... నేడు కుస్తీ!



*రాజకీయాలలో స్నేహాలకు గాని, శత్రుత్వాలకు గాని గ్యారంటీ వుండదు. పార్టీలను బట్టి స్నేహితులవుతుంటారు. అవసరాలనుబట్టి శత్రువులుగా మారుతుంటారు. ఈరోజు మనకు ఒకరి భుజం మీద చేతులు వేసుకుని కనిపించిన నాయకులే మర్నాడు చేతులతో కొట్టుకుంటూ కనిపిస్తారు. రాజకీయాలలో ఏ నాయకుడు ఎప్పుడు ఎవరితో కలిసి వుంటారో చెప్పడం కష్టం.*

మొదట్నుండి సర్వేపల్లి నియోజకవర్గం రాజకీయ వాదులాటలకు పెద్ద కేంద్రంగా వుంది. 1994 నుండి కూడా ఇక్కడ సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, సి.వి.శేషారెడ్డిలు తిట్టుకుంటుండేవాళ్లు. 2004లో కాంగ్రెస్ అభ్యర్థిగా ఆదాల ప్రభాకర్‌రెడ్డి వచ్చాడు. అప్పటి నుండి సోమిరెడ్డి, ఆదాలల మధ్య ఫైట్ నడుస్తూ వస్తుంది. వీళ్లిద్దరూ ఒకర్నొకరు తీవ్రంగా విమర్శించుకునేవాళ్లు. ఈమధ్యకాలంలో సోమిరెడ్డి, ఆదాల మధ్య టామ్ అండ్ జెర్రీ ఫైట్ కనిపించడం లేదు. సర్వేపల్లి ప్రశాంతంగా వుందనుకుంటున్న టైంలో ఆదాల మీద వైకాపా ముఖ్యసమన్వయకర్త కాకాణి గోవర్ధన్‌రెడ్డి కత్తి తిప్పడం మొదలుపెట్టాడు. రేపు సర్వేపల్లి నియోజకవర్గ వైకాపా అభ్యర్థి కాకాణి గోవర్ధన్‌రెడ్డే! ఇక కాంగ్రెస్ అభ్యర్థిగా ఆదాల ప్రభాకర్‌రెడ్డికి తప్పకపోవచ్చు. ఆదాలను లక్ష్యంగా చేసుకునే తన దీవెనయాత్రలో కాకాణి పదునైన విమర్శనాస్త్రాలను వదులుతున్నాడు. ఆదాలపై చాలా ఘాటుగా విమర్శలు చేస్తున్నాడు. ధమ్ముంటే మళ్ళీ సర్వేపల్లి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీచేసి తనపై గెలవాలని సవాల్ విసురుతున్నాడు.

ఆదాల, కాకాణిలకు గతంలో రాజకీయంగా ఎటువంటి వైరం లేదు. కాకాణి మొదటి నుండి ఆనం అనుచరుడిగానే వున్నా, ఆదాలతో విభేదాలు లేవు. 2009 ఎన్నికలలో ఆత్మకూరు సీటు విషయంలో పేచీ వచ్చి ఆనం సోదరులకు కాకాణి దూరం కావడం జరిగింది. ఆ సమయంలోనే ఆయన సర్వేపల్లి అభ్యర్థిగా పోటీచేసిన ఆదాల ప్రభాకర్‌రెడ్డికి దగ్గరయ్యాడు. ఆ ఎన్నికలలో ఆదాల గెలుపు కోసం కాకాణి బాగానే కష్టపడ్డాడు. తన సొంత పొదలకూరు మండలంలో ఆదాలకు భారీమెజార్టీ తెప్పించాడు. ఆ తర్వాత ఆదాల-కాకాణిల కాంబినేషన్ చాలాకాలం నడిచింది. కాలక్రమంలో కాకాణి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరిపోగా ఆదాల కాంగ్రెస్‌లోనే వుండిపోయాడు. ఆదాల, కాకాణిల మధ్య రాజకీయ విభేదాలుగాని, మనస్పర్థలుగాని లేవు. సర్వేపల్లి నియోజకవర్గంలో చేపట్టిన 'దీవెనయాత్ర' ప్రారంభంలో కూడా కాకాణి విమర్శల జోలికి పోలేదు. కాని ఈమధ్య కాలంలోనే ఆదాలపై ఆయన విమర్శల దాడిని ఉధృతం చేసారు. ఈ విమర్శల వెనుక ఏదో రాజకీయ కారణం దాగుందని పలువురి అనుమానం.

అమ్మ ఫర్నిచర్ మాల్
మినిబైపాస్‌రోడ్, నెల్లూరు.
- సరికొత్త, ప్రపంచస్థాయి మోడల్స్
- ఇంపోర్టెడ్ & ఇండియా ఫర్నిచర్
ఫైనాన్స్ సదుపాయము, ఆదివారం షాపు గలదు.




E[illegible]ed, Published, Printed & owned by THUNGA SIVAPRABHATH REDDY, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at Roopa Graphics, Plot no:1&2, Main Road, Magunta Layout NELLORE-52400[illegible] Ph:2323485. Editor-THUNGA SIVAPRABHATH REDDY, Executive Editor-G.SREENIVASULU REDDY.